సెప్టెంబర్ - 2025

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | కె.ఇ. రాజేంద్ర | 02 |
| జప్పుప్పనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 05 |
| యాక్...థూ...ఛీ | కె.ఇ. రాజేంద్ర | 07 |
| దేవుని గూర్చిన జ్ఞానము | హన్నాకృప డెస్క్ | 08 |
| నీ సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 09 |
| మందిరము | సాక్ష్యము | 10 |
| బైబిల్ ప్రాముఖ్యత | హన్నాకృప డెస్క్ | 13 |
| మదర్ తెరీసా | వై. ప్రసాద్‌రావు | 15 |
| తల్లిదండ్రులారా! | కె.ఇ. రాజేంద్ర | 17 |
| శరీరాశ | డా॥ సుష్మ, నెల్లూరు | 19 |
| నా కుటుంబము | స్త్రీల కొరకు | 20 |
| ప్రార్థన | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ పదవినోదం-09 | | 24 |



**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

B.A.,B.L.,


**చందా వివరాలు :**

**సంవత్సర చందా రూ. 350/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-


**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం.51 , క్లాపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726



**బ్యాంకు అకౌంటు వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890




సీరియల్ నంబరు

సంపాదకీయం....

# నీ కన్ను తేటగా ఉంటే...

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు. మనిషి శరీరంలోని అవయవాలన్నిటిలో కన్ను చాలా ముఖ్యమైనది. మనుష్యులలోని భోగేచ్ఛలకు కారణం కన్నే. కన్ను మనుష్యుల ఆలోచనలను ప్రభావితం చేస్తుంది. నచ్చటం నచ్చకపోవడానికి కారణం కన్ను. 'దేహమునకు దీపము కన్నే గనుక' అని యేసుప్రభువు చెప్పిన సందర్భం మనం చూచినట్లయితే, ధనమును గూర్చి చెప్పేటప్పుడు ఈ మాటలు చెప్పినట్లుగా చూడగలం. 'భూమి మీద మీ కొరకు ధనము కూర్చుకొనవద్దు' అని చెప్తూ ఈ మాటలను చెప్పాడంటే అర్థం, ధనము సంపాదించా లనుకోవడానికి కన్ను మనిషిని పురికొల్పుతుంది. నీ కన్ను చూచిన దానిని నీవు కోరుకుంటే దానిని పొందాలనుకుంటావు. ఈ కన్నే మనల్ని కష్టాలపాలు, నష్టాలపాలు చేస్తుంది. మనం పాపములో పడటానికి కన్నే కారణమవుతుంది. మోహపు చూపు వ్యభిచరించడానికి కారణ మవుతుంది. మన కళ్ళే మనల్ని నరకపాత్రులను చేస్తాయి. దేహమునకు దీపమైన ఈ కన్నే మన జీవితాన్ని చీకటి చేస్తుంది. హవ్వ పాపము చేయడానికి కన్నే కారణమయ్యింది. ఏదెను తోట మధ్యలో వేయబడిన మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు ఫలమును హవ్వ ప్రతిరోజూ చూస్తూనే ఉంది. అయినా ఆ చెట్టు ఫలము తినడానికి ధైర్యం చెయ్యలేదు. అయితే సాతాను వలన పురికొల్పబడినప్పుడు మాత్రం ఆ చెట్టు ఫలము హవ్వ కన్నులకు ఎంతో అందంగా, చూపునకు రమ్యంగా కనబడి, దేవుని ఆజ్ఞని సైతం లెక్క చెయ్యకుండా పండు కోసుకొని తినింది. ఈ లోకంలో మనం కూడా అంతే. ఇతరులను చూసి పురికొల్పబడి, మనకు నచ్చిన ప్రతిదానిని సంపాదించాలని కోరుకుంటాము. ఏదైనా ఒక మంచి వస్తువు చూచినప్పుడు అది మనకు అవసరమున్నా లేకున్నా, మన కన్ను చూచిన వాటిని, బట్టలు, కారు, ఒక అందమైన భవనం, బంగారం, టి.వి, ఫ్రిడ్జ్, ఏ.సి.లాంటివి పొందాలనుకుంటాము. వాటిని పొందాలంటే ధనము అవసరము. ధనము సంపాదించడానికి అనేకమైన అడ్డదారులు తొక్కడం, అక్రమంగా సంపాదించటం జరుగుతుంది. ఈ లోకభోగాలు అనుభవించడానికి అవసరమైన ధనం సంపాదించడానికి కన్ను కారణం అవుతుంది. మనం ఎంత సంపాదించినా మన కన్నులను తృప్తిపరచలేము. *"అయినను అతడు ఎడతెగక కష్టపడును; అతని కన్ను ఐశ్వర్యముచేత తృప్తిపొందదు. అతడు సుఖమనునది నేనెరుగక ఎవరి నిమిత్తము కష్టపడుచున్నానని అనుకొనడు; ఇదియు వ్యర్థమైనదై బహు చింత కలిగించును" (ప్రసంగి 4:8).* ఈ లోకాశలకు కారణమైన మన కన్నులు తేటగా ఉండాలంటే మన హృదయములో వాక్యము ఉండాలి. దేవుని వాక్యము మన కన్నులకు వెలుగును ఇస్తుంది. *"యెహోవా ఉపదేశములు నిర్దోషమైనవి, అవి హృదయమును సంతోషపరచును. యెహోవా ఏర్పరచిన ధర్మము నిర్మలమైనది, అది కన్నులకు వెలుగునిచ్చును" (కీర్తనలు 19:8).* కాబట్టి మన హృదయం వాక్యముతో నిండి ఉంటే ఈ లోకభోగాలను ఆశించకుండా మన కన్ను తేటగా ఉండి మన దేహము వెలుగు మయమై ఉంటుంది. దేహమునకు దీపమైయున్న నీ కన్నులను తేటగా ఉంచుటకు నీ హృదయమును వాక్యముతో నింపుటకు నీవు సిద్ధమా?

**- కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర, ఎడిటర్**

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 1095729434О**

సీరియల్



# జప్నత్పనేహు

**(యోసేపు జీవిత చరిత్ర)**

**- కొడవటికంటి**

వివాహమైన మొదటి ఆరునెలలు జప్నత్పనేహు ఎటువంటి బాధ్యతలు స్వీకరించడు. ఆరునెలల తర్వాత దేశమంతటా రెండు నెలలు పర్యటించి, తదుపరి నాలుగు నెలలు తర్వాత ఒకనెల దేశ పర్యటన చేసేటట్లుగా ఫరో ఆజ్ఞ ఇవ్వబడింది. రాజ్యాధికారం చేపట్టిన రోజు నుండి జప్నత్పనేహు అని పిలువబడినందున, రాజ్యములకు, విదేశాల వారికి కూడా యోసేపు పేరు మరుగు చేయబడి జప్నత్పనేహుగా మాత్రమే పరిచయం చేయబడింది. ఇంతకు ముందు యోసేపుగా తెలిసినవారు, మొదటి ఆరు నెలలు యోసేపు ఎవరికి కనిపించకుండా పెండ్లి కుమార్తెతో కలసి ఫరో విశ్రాంతి మందిరములో ఉండినందున యోసేపును మర్చిపోయి జప్నత్పనేహుగా గుర్తుంచుకున్నారు.

ఫరో యొక్క విశ్రాంతి మందిరము నైలునది అయిదవ పాయ చివరలో మహా సముద్రంలో కలిసే చోటనే సముద్ర మునకు అరమైలు దూరంలో ఉంది. విలాస మందిరమని చెప్పబడే ఈ మందిరం నిర్మాణమైన తర్వాత రెండుసార్లు మాత్రమే ఫరో దీనిని ఉపయోగించి, ఇక ఆ మందిరమునకు వెళ్ళకూడదని నిశ్చయించుకున్నాడు. ఆ మందిరములోకి ఎవరైనా వెళ్ళేటప్పుడు మాత్రమే బయటి ప్రపంచం గుర్తుంటుంది. అందులో ప్రవేశించిన వారికి, ఎవరైనా బయట ప్రపంచంలో నుండి వెళ్ళి గుర్తు చేస్తేనే కాని ఏది గుర్తుకు రానంత విలాసవంతమైనది.

ఆసెనతు ఆ మందిరము గురించి ఎప్పుడు విని యుండలేదు. ఐగుప్తులో దానిని నిర్మించిన వారికి, ఆ మందిర కాపలాదారులకు, ప్రధానికి, ఫరోకు తప్ప, ఆ మందిరము ఇతరులకు తెలియదు. అందువలన ఆసెనతు ఆ మందిరంలోకి ప్రవేశించిన తర్వాత జప్నత్పనేహుని ఒక్కక్షణం కూడా వదలి ఉండలేదు. ఒక్కక్షణం వదలి పెడితే, తర్వాత తన భర్త కూడా జ్ఞాపకం రాదేమోనన్నంత సుందరంగా అలంకరించబడింది ఆ విశ్రాంతి మందిరం. మందిర ముఖద్వారం నుండి, పడకగదిలోని మంచం వరకు దేనిని ఉపయోగించాలన్నా అక్కడ పనిచేసే సేవకులను సంప్రదించవలసిందే. కిటికీ తెరవాలన్నా, ఆసెనతు సేవికను పిలిచి, ఎలా తెరవాలో నేర్చుకుంది. మంచినీరు గిన్నెలో ఎలా పోసుకోవాలో కూడా తెలియకుండా ఉండటం వలన ఆశ్చర్యంగాను, బెరుకుగాను ఉంది.

మంచం మీద దుప్పటి పైకిలాక్కోవాలన్నా, అది రాలేదు. సిగ్గుపడుతూ, సేవికను పిలిస్తే “మంచం మీద ఉన్న దుప్పట్లు కప్పుకోవటానికి కాదు” అని మంచం ప్రక్కన మీట నొక్కితే పై నుండి ఒక పల్చని దుప్పటి నాలుగు చెంగులు దేనికి బంధించబడకుండానే క్రిందకి దిగి వచ్చింది. మరలా మీట నొక్కితే మరలా ఒక దుప్పటి మంచంపైన ఎత్తుగా పేర్చబడిన దుప్పట్లలోకి వెళ్ళింది. మొదటి వారమంతా ఇటువంటి విషయాలు తెలుసుకొనిన తర్వాత ఇక సేవకులు లేకుండా ఈ ప్రపంచం మొత్తం తామిద్దరమే మిగిలిపోయినట్లుగా సంతోషించారు. తర్వాత వారు ఈ మందిరంలోకి వచ్చి, ఎన్ని రోజులైందోనని లెక్క వేసుకుంటే, జవాబు తప్పుగానే వచ్చినట్లనిపించింది. అప్పటి నుండి వారు ఈ మందిరంలోకి వచ్చి, ఎన్ని రోజులు అయ్యిందో తెలుసుకోటానికి ఎంతమంది సేవకులను అడిగినా వారందరూ వీరి భాష తెలియని వారివలె, మూగవారివలె, చెవిటివారివలె కనిపించారు గాని సమాధానం దొరకలేదు. చివరకు నపుంసకుల అధికారిని పిలిపించి అడిగితే, “మీరు ఇక్కడ ఆరు మాసములు ఉంటారు. ఆ గడువు పూర్తి అయిన తర్వాత మేము మిమ్ములను తీసుకొని వెళ్తాము. దయయుంచి ఆ విషయం అడుగవద్దని” చెప్పాడు.

వీరిని చూడడానికి ఎవరూ రాలేదు. వీరికి అలా అనిపించలేదు. ఒకరోజు ఉదయం పరిచారకులు వారిని చక్కగా అలంకరించబడిన పడవలో సముద్రంలోనికి తీసుకొని వచ్చారు. పడవ సముద్రంలో ప్రయాణం చేసి, మరలా నైలునది మొదటి పాయలో ప్రవేశించి, నీటికి ఎదురుగా నడచి, ఓను దేవాలయం వాకిట్లో దించింది. వారి రాక కొరకు ఆసెనతు తల్లిదండ్రులు, అక్షాపు, వియాన్, మాత్రమే దేవాలయం వద్ద ఎదురు చూస్తున్నారు. పడవలో నుండి ఒడ్డుకు వస్తున్న జప్నత్పనేహుని, ఆసెనతుని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. వారిద్దరూ పూర్తిగా మారి పోయారు. శరీర సౌష్టవం పెరగటమే కాక మేనిఛాయ మారింది. ఆసెనతు తల్లికి మాత్రం తెలుసు. జప్నత్పనేహు, ఆసెనతులు ఇప్పుడు ముగ్గురయ్యారని!

ఆసెనతుకు ఇప్పుడు మరలా ఒంటరి జీవితం గడుప బోతున్న సంగతి గుర్తుకు వచ్చింది. అక్షాపు తమని నైలునది వద్ద నుండి ఆహ్వానించడం అంటే, జప్నత్ప ఇప్పుడు దేశమంతా రథం మీద పర్యటించబోతున్నాడు. తన యావ శ్చక్తి, తెలివితేటలు రాబోయే ఏడు సంవత్సరాల కరవు రాక్షసి కోరల నుండి ప్రపంచాన్ని జీవింపచేయడానికి ఉపయో గించాలి. ఇప్పుడు మొదటి సంవత్సరం సమృద్ధిలో ఐగుప్తు ప్రవేశించింది. ఇప్పుడు పంట దిగుబడి, దానిని దాచి పెట్టడంలో యోసేపు తన జ్ఞానం ఉపయోగించవలసి ఉంది. తన ప్రేమ, తన జ్ఞాపకాలు ఇవన్నీ కొంత కాలం జప్నత్పను బాధించకూడదు. అదీకాక తన శరీరంలో మొదటి శిశువు యొక్క కదలికలు అనేక మార్పులు తెస్తున్నాయి.

విశ్రాంతి మందిరం నుండి వచ్చినప్పటి నుండి జప్నత్పను రాత్రుళ్ళు మాత్రమే తను చూడగలుగుతుంది. జప్నత్ప రథం దిగి లోపలికి వచ్చేటప్పుడు తల మీద కిరీటం తీసి ప్రక్కన పెట్టే వరకు, ఐగుప్తు దేశాన్ని తను మోస్తు న్నట్లుగా ఆలోచిస్తున్నాడు. ఇక కొద్ది రోజులలో దేశంలోకి వెళ్ళిన తర్వాత ఇంత భారంగా ఉండక పోవచ్చు. ప్రయాణం చేయడం, పని జరుగుచున్న స్థలంలో నిలబడటం కంటే, వాటిని గురించి ఆలోచించడమే మనిషికి మరింత అలసట. ఆలోచిస్తూ అలానే నిద్రపోయిన ఆసెనతుకు చెంపకి తగిలిన వెచ్చని చేయి స్పర్శతో మెళకువ వచ్చింది. లేచి కూర్చోబోతే మెత్తగా వారించాడు. ప్రక్కన కూర్చున్నప్పుడు విచారంగా కనిపించాడు జప్నత్ప.

“ఏమిటి అలా ఉన్నారు?” అంది కళ్ళు సగం తెరచి.

“ప్రయాణం రేపు” అని చెప్పాడు.

కళ్ళు పెద్దవిగా తెరచింది. ఇందాకే కదా? అనుకుంది. ఇంకా కొద్దిరోజులు ఉంటాడని... నీరసంగా తోచింది. మళ్ళీ బాధ్యత. జప్నత్ప బాధ్యత తీసుకొనినప్పటి నుండి, సగం తను పంచుకోవాలనుకుంది. కాని అంత అవసరం రాలేదు. కాని ఇప్పుడు తనను వదలి వెళ్తుంటే, చాలాకాలం ఎడబాటు గుర్తుకు వస్తుంటే, తను జప్నత్పని, వదలి ఉండగలనా? అనిపించింది ఆసెనతుకు. **(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపించాలంటే క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్

# నా చిత్తానుసారుడు

35

(దావీదు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

అబ్నేరు కొంచెం ముందుకు వచ్చి "మన యెదుట యవ్వనస్తులు మల్లచేష్టలు చేయుదురా?" అన్నాడు.

యోవాబు బదులివ్వక ముందే పన్నెండుగురు కొలను దక్షిణమున ఉన్న ఖాళీస్థలం వైపు కదిలారు. అబ్నేరు మనుష్యులు కూడా వారి ఎదురుగా నిలుచున్నారు. ఎవరి దగ్గర ఎటువంటి ఆయుధాలు లేవు. మల్లయుద్ధం మాత్రమే చేయాలి. యోవాబు దగ్గరగా వచ్చి ఒకటి రెండు మూడు అనగానే మల్లయుద్ధం చేస్తున్న వారివలెనే చేతులు చేతులు పట్టుకొని క్రింద పడవేయాలన్న ఉద్దేశంగల వారివలే వంగి ప్రతి ఒక్కడు వారి వారి నడికట్టులో దాచిన చురకత్తులను దీసి పొడుచుకొని ఇరువైపుల వారు ఆశ్చర్యం నుండి తేరుకొనే లోపల క్రిందపడి చనిపోయారు.

ఒక్కసారిగా అబ్నేరు వెనుకనున్న అరణ్యంలో నుండి అబ్నేరు సైనికులు. యోవాబు వెనుకనున్న అడవిలో నుండి యోవాబు సైనికులు అరుస్తూ ముందుకు వచ్చిన ఒక్క అరగంటలోనే వందల సంఖ్యలో శవాలు పడిపోయాయి.

అబ్నేరు ఇలా ఎన్నడూ ఊహించలేదు. నిజానికి తాను తెచ్చిన సైన్యమే ఎక్కువ అనుకుంటుంటే యోవాబు సైన్యం అంతకంత వుంది. అయినా అబ్నేరు చుట్టు సైనికులు నీరసంగా కనిపించారు. వారు చాలా దూరం నడచి వచ్చారు. తొందరలోనే తన సైన్యం తిరిగి పోవటం అబ్నేరు చూసి ఇటు చూస్తే అబీషై కూడా దక్షిణం నుండి సైన్యంతో రావటం గమనించి తొలగిపొమ్మని తన వారికి ఆజ్ఞ ఇచ్చేటప్పటికి అందరూ తూర్పు తట్టుగా యొర్దాను వైపు పరుగెడుతూ వున్నారు.

అబ్నేరు కూడా సైన్యంతో పరుగెత్తలేకపోయాడు. తన వయస్సు ఇప్పుడు డెబ్బయి సంవత్సరాలు. ఆశాహేలు ఉత్తరం వైపున అడవిలో నుండి జింక పిల్లలాగ పరుగెత్తుతూ రావటం కనిపించింది. అతను తనను సమీపిస్తే అతనే చచ్చిపోతాడు. తన బలం ముందు అతను సగం మాత్రమే. వయస్సు ఇంకా ముప్పయిలో పడలేదు. అతనికి కనబడ కూడదనుకుంటూ పరుగెత్తబోయేటప్పటికి అతను తనవైపే వస్తున్నాడు.

"నీవు ఆశాహేలువా?" అని అరిచాడు.

ఆశాహేలు నిలబడి "ఔను ఆశాహేలునే" అన్నాడు.

"నీవు కుడివైపుననైనను ఎడవైపునకైననూ తిరిగి యవ్వనస్తులలో ఒకని కలిసికొని, వాని ఆయుధాలను పట్టుకొమ్ము" అన్నాడు అబ్నేరు.

వారిద్దరి మధ్యలో పెద్ద గొయ్యి ఉంది. తిరిగి అబ్నేరు దగ్గరకు రావాలని ఆశాహేలు తన కుడివైపుగా పరిగెత్తటం ప్రారంభించాడు.

"నన్ను తరుముట మాని తొలగిపొమ్ము" అనగానే ఆశాహేలు ఆగాడు.

"నేను నిన్ను నేలకు కొట్టి చంపిన యెడల నీ సహోదరు డగు యోవాబు ముందు నేనెట్లు తల ఎత్తుకొనగలను?" అన్నాడు బ్రతిమాలుతున్నట్లుగా.

"నేను తొలగను" అని ఆశాహేలు కత్తి చేతిలో ఉండగా అబ్నేరు వైపుగా రాబోయాడు.

తన చుట్టు వున్న తన తోటి సైనికులు అందరూ చూస్తున్నారు. ఇక లాభం లేదని తన చేతిలోని యీటె బలంగా ఆశాహేలు మీదకు విసిరాడు. అది గమనించిన ఆశాహేలు తన చేతిలోని కత్తితో దాన్ని ప్రక్కకు నెట్టాలని అనుకున్నాడు కాని అబ్నేరు యీటె వేగానికి అతని కత్తి క్రిందపడిపోయింది. ఒక్క క్షణం ముందుగా అబ్నేరు చేతిలోని యీటె ఇప్పుడు ఆశాహేలు శరీరంలో నుండి అవతలకి వెళ్ళి నేలమీద గుచ్చుకుంది. ఆశాహేలు నేలకొరిగాడు.

ఈ సంగతి తెలిసి అబీషై, యోవాబు ఇద్దరూ అబ్నేరు కొరకు గాలించడం మొదలుపెట్టారు. సాయంకాలం అయింది. సూర్యుడు కృంగిపోతున్నాడు. అబీషై, యోవాబు ఒక చోట కలుసుకున్నారు. అబ్నేరు దొరకలేదు. ఇంతలో

ఉరుమువంటి అరుపు ఎదురుగా వున్న గిహ కొండమీద నుండి తలెత్తి చూసారు. అబ్నేరు కొండపైన నిలుచున్నాడు.

"కత్తి చిరకాలము భక్షించునా? అది తుదకు ద్వేషము నకే హేతువగునని నీవెరుగుదువు గదా! తమ సహోదరులను తరుమవద్దని నీవెంత వరకు జనులకు ఆజ్ఞ ఇయ్యక యుందువు" అన్నాడు అబ్నేరు.

యోవాబు అబీషై వైపు చూచి "యెహోవా జీవము తోడు జగడమునకు నీవు వారిని పిలువకయుండిన యెడల జనులందరూ తమ సహోదరులను తరుమక ఉదయముననే తిరిగిపోయియుందురు" అని బాకా పట్టుకొనియున్న అతనికి సైగచేసాడు. అతను బాకా ఊదగా ఆ సమయంలోనే అరుపులు కేకలు ఆగిపోయినవి. దూరంగా మోరేలోని సింధూర వృక్షములకు దాపున గిల్గాలునకు ఎదురుగానున్న అరాబాలో నేలమీద కారిన ఇశ్రాయేలీయుల నెత్తురు పులుముకొని, ఎర్రబారినట్లుగా సూర్యుడు క్రిందకి దిగిపోయాడు.

యుద్ధము ఆనాటికి ముగిసిన తర్వాత కాని తన తమ్ముడైన ఆశాహేలు గుర్తు రాలేదు. యోవాబు, అబీషై ఒకరి ముఖము ఒకరు చూచుకున్నారు. వెలుతురు క్రమంగా తగ్గి చీకటి ఆవరిస్తున్న సమయంలో వారిద్దరి ముఖాలు దుఃఖముతో వాడిపోయినవి.

యోవాబు "ఆశాహేలు" అన్నాడు గద్గదస్వరంతో. ముందుకు కదిలాడు, వారి వెనుక కొద్ది సైన్యము కదిలింది. కదలకుండా ఎండిపోయిన రక్తంలో నేలకు అతుక్కుని ఉన్న తమ్ముని శవం దగ్గరగా గబగబా నడచి వచ్చారు. తమ్ముని శవం చుట్టు సైన్యం మూగివున్నారు. యోవాబుకి ఆశాహేలుకి రక్తసంబంధము కంటే మైత్రి ఎక్కువ. చిన్నపిల్లాడిలా ఏడుస్తూంటే ఈ వీరుడేనా ఇంతమంది ఇశ్రాయేలీయులను హతమార్చింది అనుకున్నారు ప్రక్కనున్న సైనికులు.


అందరూ కలసి బేత్లెహేము వరకు పాడెకట్టి మోసు కొని వచ్చారు. మిగిలిన కొన్ని శవాలు ఇశ్రాయేలీయులు వారివి, యూదా వారివి అక్కడక్కడ చెట్లలో పుట్లలో రకరకాల భంగిమలలో పడి ఉన్నాయి.

ఆశాహేలును బేత్లెహేములో పాతిపెట్టి హెబ్రోను చేరారు.

హెబ్రోనులో రాజుగా నియమితుడైన నాటినుండి ఒక్క రోజైనా మనఃశ్శాంతి లేకుండా పోయింది దావీదుకి. ఆనాడు అరణ్యంలో తిరిగేటప్పుడు ఎప్పుడో ఒకసారి సౌలురాజు తనను పట్టుకోవటానికి బయలుదేరాడని కబురు వచ్చి నప్పుడు మాత్రమే శోధన. ఇప్పుడు ప్రతినిత్యం ఏదో ఒక శోధన. సైన్యంలో ప్రతినెల జీతాలు తీసుకొనే వాళ్ళు, మరికొందరు ఇంటివద్ద పనిపాట చేసుకుంటూ వారానికి రెండుసార్లు ఉదయం రెండు గంటలు స్థానిక సహస్రాధిపతు లతో యుద్ధ తర్ఫీదు పొందేవాళ్లకి కొంత బహుమానము, గుఱ్ఱాలకు, గాడిదలకు మేత, వారి కుటుంబాలు, వారి వారి పిల్లలు, ఈ వ్యాపకాలే ఎక్కువ భాగం సమయం తినేస్తున్నాయి. ఇవి తప్పించుకోటానికి వీలు లేనివి. ఇవన్ని ఒక ఎత్తు అయితే ప్రతినిత్యం అబ్నేరు సేవకులతో రాజ్యంలో ఏదో ఒకమూల కొట్లాటలు, మరణాలు.

అరణ్యంలో సంచరించేటప్పుడు నిత్యం దేవుని సన్ని ధిని వెదికితే హెబ్రోనులో సబ్బాతుదినము బలిఅర్పణ ఆలోచనలో మెదిలినవి. ఆధ్యాత్మిక దైవచింతన పోయి శరీరాధన మొదలైంది.

ఇప్పటికి ఆరుగురు భార్యలు ఆరుగురు కుమారులు. ఈ ఆరు కాపురాలు చూడటంతో అబీషైతో సహవాసం సంప్రదింపులు చాలా తగ్గిపోయినవి. రాజ్యం దేవుడిచ్చినదే తన తండ్రి నుండి తనకు సంక్రమించినది కాదు. అది పరిపాలించవలసిన పద్ధతి కూడా దేవునిదే. నాతాను ప్రవక్త కొత్తగా తనను కలుసుకుంటున్నాడు. అతను తన వయస్సు వాడే ఎందుకో అతనంటే ప్రవక్త అనే అభిమానమున్నప్పటికి స్నేహితుని పోలిన సంబంధం ఏర్పడినది. తల్లిదండ్రులు బేత్లెహేములోనే వుంటున్నారు. అక్కడ గొఱ్ఱెల సంపద అంతా ఇంతకాలం బంధువుల ఆధీనంలో ఉండినది. తన అన్నలు సైన్యంలో ఉండటం వలన, వారి ప్రమేయం అంతగా ఉండేదికాదు. వారిని మొదట నుండి ఒక అడుగు దూరంలో వుంచాడు. వారి పిల్లలు మాత్రం తన పిల్లలతో ఒకరిగా కోటలో నివశిస్తుండేవారు. **(సశేషం)**



# ‘యాక్... థూ... ఛీ’



అసహ్యమైన దానిని చూస్తే ‘యాక్... థూ... ఛీ’ అని కళ్ళు మూసుకొని, ముక్కు మూసుకొని, ఉమ్మేసి వెళ్ళిపోతాం కదా! బురదలో పొర్లాడే పందిని చూసి అసహ్యించుకుంటామే కానీ, ఆహా ఎంత బాగా పొర్లాడుతుంది అని కాసేపు అక్కడే నిలబడి వేడుక చూస్తామా, ఛీ... ఛీ... అనుకుంటూ వెళ్ళి పోతాము. కొంతమంది మనుష్యులను చూస్తే కూడా మనకి అసహ్యమేస్తుంది. త్రాగుబోతులను చూచినా, దొంగతనం చేసేవాళ్ళని, వ్యభిచారం చేసేవాళ్ళని చూచినప్పుడు మనకి అసహ్యం కలుగుతుంది. వాళ్ళు చేసే పనులు మనకి నచ్చక పోతే వాళ్ళకి ఆమడ దూరంలో ఉంటాము. మనం చాలా నీతిమంతులమన్నట్లు వాళ్ళ దరిదాపుల్లోకి మనం వెళ్ళక పోవడమే కాకుండా ఇతరులకు కూడా చెప్తాము, వాళ్ళ దగ్గరకు వెళ్ళమాకండి వాళ్ళు మంచోళ్ళు కాదు అని. ఇతరులను చూచి మనం ఎలా అసహ్యించుకుంటామో మనం చేసే పనులు దేవునికి నచ్చకపోతే దేవుడు కూడా మనల్ని అలానే అసహ్యించుకుంటాడు. “మీరు మనుష్యుల యెదుట నీతిమంతులని అనిపించుకొనువారు గాని దేవుడు మీ హృదయములను ఎరుగును. మనుష్యులలో ఘనముగా ఎంచబడునది దేవుని దృష్టికి అసహ్యము” (లూకా 16:15). ఏదైతే మనకి మనం గొప్పగా భావిస్తామో దానిని దేవుడు అసహ్యించుకుంటాడు. మనం ఏ పని చేసినా మనుష్యులను దృష్టిలో పెట్టుకొనే చేస్తాము. అందరూ మనల్ని పొగడాలని, గొప్పగా అనుకోవాలని చాలా కష్టపడతాము. పైసా పైసా కూడబెట్టి బాగా డబ్బు దాచిపెట్టి, చాలకపోతే అప్పులు చేసైనా సరే అందమైన ఇల్లు కట్టుకొని, ఖరీదైన వస్తువులు కొంటాము. ఖరీదైన బట్టలు, నగలతో అలంకరించుకోవడం ఇదంతా మనుష్యుల మెప్పు కోసమే. ఉద్యోగం చేసినా, వ్యాపారం చేసినా మనుష్యుల ముందు ఘనంగా ఉండటానికే. లక్షల రూపాయలు ఖర్చు చేసి పెళ్లి చేసినా, ఫంక్షన్ చేసినా ఎవరూ వేలెత్తి చూపించకూడదని మనుష్యుల కోసమే చేస్తాము తప్ప దేవుడు వచ్చి భోజనం చేసి వెళ్తాడు అని దేవుని కోసమేమి చేయము. “వారు దేవుని మెప్పుకంటె మనుష్యుల మెప్పును ఎక్కువగా అపేక్షించిరి” (యోహాను 12:43). మనుష్యులు మనల్ని చూచి ఆహా, ఓహో అంటుంటే మనం గాల్లో తేలిపోతుంటాము. మన కష్టానికి ఫలితం దక్కిందని సంబరపడి పోతాము. ఇదంతా దేవుని కోసం చేస్తామా? దేవుడు మనల్ని చూసి ‘శెబాష్ బిడ్డా’ అని అనాలని ఇంత కష్టపడతామా? అంతేకాక మన భక్తి కూడా మనుష్యుల మెప్పును ఆశించే ఉంటుంది. మనల్ని భక్తిపరులు, నీతిమంతులు అని మనుష్యుల గుర్తింపు పొందటానికి తెగ ఆరాటపడిపోతాము. ఇలా మనం చేసే ప్రతి పనీ మనుష్యులని దృష్టిలో పెట్టుకొనే చేస్తాము తప్ప, దేవుని దృష్టిలో పడాలని మాత్రం కాదు. దేవుని కంటే మనుష్యులకు ఎక్కువ విలువ ఇచ్చే వాళ్ళని చూస్తే దేవునికి అసహ్యము. ఒకవేళ తమ్మును తాము తగ్గించుకొని దేవుని మెప్పు పొందాలనుకొనే వాళ్ళు దేవునిబట్టి మనుష్యులను ప్రేమిస్తారే కానీ, మనుష్యుల మెప్పు ఆశించరు. కేవలం తమ్మును తాము హెచ్చించుకొనే వారు మాత్రమే మనుష్యుల వలన ఘనత ఆశిస్తారు. మనుష్యుల వలన ఘనత ఆశించి చేసే పనులు దేవునికి అస్సలు నచ్చవు. మనకి నచ్చని వాటిని చూచి మనం ఎలా అసహ్యించుకుంటామో, దేవునికి నచ్చని వాటినిబట్టి **‘యాక్... థూ... ఛీ’** అని దేవుడు అసహ్యించుకుంటాడు.


**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# దేవుని గూర్చిన జ్ఞానము సంపాదించు

**"నేను బలిని కోరనుగాని కనికరమునే కోరుచున్నాను, దహనబలుల కంటే దేవుని గూర్చిన జ్ఞానము నాకిష్టమైనది" (హోషేయా 6:6).**

ఈ భూమి మీద జీవిస్తున్న మనుష్యులలో చాలామంది అనేక విషయాల్లో విశేషమైన జ్ఞానము కలిగి ఉంటారు. చాలామంది దేవుడు సృష్టించిన వాటి మీద పరిశోధనల్లో నిమగ్నమై ఉంటారు. చెట్ల గురించి, పక్షుల గురించి, జంతువులు, చేపలు, నక్షత్రాలు,నీరు, భూమి ఇలా ప్రకృతిలో ఉన్న ప్రతి దాని గురించి నిత్యము పరిశోధనలు చేస్తూ ఏవేవో క్రొత్త క్రొత్త విషయాలు కనిపెడుతుంటారు. దేవుడు సృష్టించిన వాటి మీద పరిశోధనలు చేస్తూనే ఉంటారు గాని, వాటిని సృష్టించిన దేవుని గూర్చి ఎవరూ పరిశోధన చెయ్యరు. అసలు దేవుని గూర్చి ఆలోచించే వాళ్ళు ఎంత మంది ఉంటారు? బహుశా చాలా తక్కువమంది ఉంటారేమో. ఎందుకంటే *"మనుష్యకుమారుడు వచ్చునప్పుడు ఆయన భూమి మీద విశ్వాసముకనుగొనునా?"* అని లూకా 18:8లో యేసుప్రభువు అనుమానం వ్యక్తం చేశాడు. అంటే రోజులు గడిచేకొద్దీ మనుష్యులకి దేవుని మీద విశ్వాసం సన్నగిల్లుతుంది. దేవుని గురించి ఆలోచించేవారు చాలా తక్కువగా ఉన్నారు. యేసుప్రభువు మరణించి తిరిగి లేచి ఆరోహణమైన తరువాత అనేకమంది ఆయనయందు విశ్వాసముంచి, తమ ఆస్తులు అమ్మి పేదలకు పంచారు. కానీ కాలక్రమేణా దేవునియందలి భయభక్తులు లేకుండా జీవిస్తూ, చివరికి దేవుడే లేడనే స్థాయికి వచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో దేవుని గురించి ఆలోచించి, ఆయన గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఎవరికి ఉంటుంది? *"ఈ లోక జ్ఞానము దేవుని దృష్టికి వెర్రితనమే" (1కొరింథీ. 3:19).* అయినప్పటికీ మనుష్యులు వెర్రితనమైన ఈ లోకజ్ఞానాన్ని సంపాదించడానికి ఎంతో ప్రయాసపడుతుంటారు. నేటి క్రైస్తవ సమాజంలో ఎంతమంది క్రైస్తవులకి దేవుని గూర్చిన జ్ఞానం ఉంది? ఆదివారం చర్చికి వెళ్ళటం, ప్రార్థనా కూటాలకి హాజరవ్వటం, దేవుడు తమకుఏమి వాగ్దానం ఇస్తాడో అన్న ఆశతో బైబిలు చదవటం, చందా ఇవ్వడమే తప్ప దేవున్ని పరిశీలనగా తెలుసుకుందామని ఎంతమంది క్రైస్తవులకి ఉంది? అపొస్తలుడైన పౌలు ఫిలిప్పీయులకు పత్రిక వ్రాస్తూ, *"అయినను ఏవేవి నాకు లాభకరములై యుండెనో వాటిని క్రీస్తు నిమిత్తము నష్టముగా ఎంచుకొంటిని. నిశ్చయముగా నా ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన అతి శ్రేష్ఠమైన జ్ఞానము నిమిత్తమై సమస్తమును నష్టముగా ఎంచుకొనుచున్నాను"* అని ఫిలిప్పీ. 3:7,8లో దేవుని గూర్చిన జ్ఞానము ఎంత ప్రాముఖ్యమో తెలియజేశాడు. అయినప్పటికీ విశ్వాసులమని చెప్పుకొనే క్రైస్తవులు సైతం అన్యజనుల వలెఈ లోకజ్ఞానం సంపాదించడానికి ఎంతో ప్రయాసపడుతున్నారే తప్ప దేవుని గూర్చిన జ్ఞానమును నిర్లక్ష్యము చేస్తున్నారు. *"దహనబలులకంటె దేవుని గూర్చిన జ్ఞానము నాకు ఇష్టమైనది"* అని హోషేయా 6:6లో దేవుడు చెప్పినా, దేవునికిష్టమైన పని ఎంతమంది చేస్తున్నారు? మనం దేవుని గూర్చిన జ్ఞానము సంపాదించి దేవునికి ఇష్టమైన పని చేయటం ద్వారా దేవున్ని సంతోషపెట్టవచ్చు. ఈ లోక జ్ఞానముకంటే దేవుని గూర్చిన జ్ఞానమే శ్రేష్ఠమైనది. మరి నీవు దేవుని గూర్చిన జ్ఞానమును సంపాదించుటకు సిద్ధమా?

**సాక్ష్యాలకు ఆహ్వానము**

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడలవాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

# నీ సృష్టికర్త

దేవుడు మానవున్ని ఎంతో ప్రేమించి అతని కొరకే ఈ సమస్త సృష్టిని చేశాడు. దేవుడు మానవుని కొరకు చేసిన ఈ సృష్టి చాలా పెద్దది ఒక రకంగా చెప్పాలంటే అనంతం. అటువంటి అనంతమైన సృష్టిని మానవుడు ఆస్వాదించడానికి అతి చిన్న భాగాన్ని మానవ శరీరంలో పెట్టాడు అదే 'కన్ను'.

మానవుని శరీరంలో కేవలం 28గ్రాముల బరువు కలిగి అతి సున్నితమైనది మరియు మెదడు తర్వాత అత్యంత క్లిష్టమైన శరీర భాగం కన్ను. మానవుని కంటిలో ముఖ్యంగా మూడు భాగాలు ఉంటాయి. మొదటిది కార్నియా. మనం ఏ వస్తువునైనా చూడగానే మొదట కాంతి పడే భాగం ఈ కార్నియ. దీని ద్వారానే కాంతి కంటి లోనికి వెళ్తుంది. ఆ తరువాతి భాగం ఐరిస్. ఇది ఎంత కాంతి లోనికి వెళ్ళాలో నిర్ణయించి పంపుతుంది దానికి అనుగుణంగా ఆ తరువాతి భాగమైన ప్యూపిల్ తన ఆకారాన్ని, పరిమాణాన్ని మార్చుకుంటుంది. ఆవిధంగా కంటి లోపలి భాగాన్ని చేరిన కాంతిలోని సమాచారాన్ని కంటి కణజాలం (రాడ్స్ మరియు కోన్స్ అనబడే సున్నితమైన కంటి కణాలు) విశ్లేషించి చిత్రాన్ని రూపొందిస్తాయి. అయితే ఆ చిత్రం వాస్తవ చిత్రానికి తలక్రిందులుగా ఉంటుంది. దానిని మెదడు సరిచేయగా మనకు వాస్తవ చిత్రం కనబడుతుది. ఇదంతా మనకు క్షణకాలంలో జరిగిపోతుంది. ఎంత ఆశ్చర్యమో కదా!

కెమెరాతో పోలిస్తే మన కన్ను 576మోగా పిక్సల్స్ రెజల్యూషన్ కలది. అడ్వాన్స్డ్ కెమెరాలో కూడా లెన్స్ ఆటోమాటిక్‌గా అడ్జస్ట్ అవ్వదు కాని మానవుని కంటిలోని ప్యూపిల్ ఆటోమాటిక్‌గా తన ఆకారాన్ని, పరిమాణాన్ని మార్చుకుంటుంది.

మన కన్ను 10మిలియన్ రంగులను గుర్తించగలదు.

కన్ను సైజు కేవలం 2.3సెం మీ. మాత్రమే

మానవుని శరీరంలో రక్తనాళాలు లేని ఒకే ఒక భాగం కంటిలోని కార్నియా.

కంటిలో 12.7 మిలియన్‌ల కణజాలం ఉంటుంది. ఇవి సెన్సార్స్‌లా పనిచేస్తాయి. వాటిలో 12 మిలియన్‌ల కణజాలం కేవలం నలుపు, తెలుపు రంగులను మరియు 30రకాల గ్రేకలర్ షేడ్స్‌ను గుర్తించడానికి ఉపయోగ పడతాయి. మిగిలిన 7మిలియన్‌ల కణాలు ఎరుపు, పచ్చ, నీలం రంగులను గుర్తించుటకు ఉపయోగపడతాయి

వేలిముద్రలలో 40రకాల లక్షణాలు ఉంటాయి. ఇవి ప్రతి మనిషికి ప్రత్యేకంగా ఉంటాయి. అలానే కంటి ఐరిస్‌లో 256 ప్రత్యేక లక్షణాలు ఉంటాయి. ఇవి ప్రతి మనిషికి వేరు వేరుగా ఉంటాయి. కాబట్టి కంటిలో ఉండే ఐరిస్ అనేది ప్రతి మనిషికి ప్రత్యేకంగా ఉంటుంది. ఆ కారణంగానే ధృవీకరణ పత్రాల ప్రక్రియలలో వేలిముద్రలతో పాటు, కంటి ఐరిస్‌ను వాడతారు.

ఒక క్రొవ్వొత్తి వెలుగును మానవుని కన్ను దాదాపు 30 మైళ్ళ దూరం నుండే కనిపెట్టగలదు. నీటిలో కూడ చూడడానికి వీలుగా కంటిలో ప్రత్యేక నిర్మాణం ఉంటుంది.

మానవ శరీరంలో అత్యంత వేగంగా కదిలేది కంటి కణజాలం. సెకనులో వందోవంతు సమయంలో కన్ను కదులుతుంది అందుకే కదిలే వస్తువులను కూడా మనం చూడగలుగుతాం.

మెదడులో 80% కంటికి సంబందించిన సమాచారమే. అంటే మనంచూసి గ్రహించిన సమాచారమే నిక్షిప్తమౌతుంది. మిగిలిన 20%లో వాసన, రుచులకు సంబంధించిన సమాచారం మరియు వినిన సంగతులు నిక్షిప్తమౌతాయి.

మానవ శరీరంలో చిన్నదైన కంటి నిర్మాణంలో దేవుడు ఇంత శ్రద్ధను చూపించాడంటే దేవునికి మానవుని పట్ల ఉన్న ప్రేమ ఎటువంటిందో గ్రహించవచ్చు. ఆ ప్రేమను నిర్లక్ష్యము చేయక ఆ దేవ దేవునికి కృతజ్ఞత కలిగి జీవిద్దాం!

సాక్ష్యము

# మందిరము

నా పేరు వెంకట రమణయ్య. మా స్వగ్రామం ప్రకాశం జిల్లా రామాయపట్నం. మేము పల్లెవారము. మా తండ్రి రాసామి మీరాసాహెబ్ మా తల్లి పేరు అంకమ్మ. మేము అయిదుగురు  అన్నదమ్ములము, ముగ్గురు అక్క చెల్లెళ్ళు. మూడవవాడిని నేను.

నేను చదువుకోలేదు. ఊహ తెలిసిన తర్వాత 12 సంవత్సరాల వయస్సు నుండి సముద్రంలో చేపలు పట్టడానికి (వేట)కు వెళ్ళేవాడిని. నేను 18 సంవత్సరాల వయస్సులోనే మద్రాసుకి వెళ్ళి చేపలు ఎగుమతి చేస్తుండే వాడిని. బాగా సంపాదించుట ప్రారంభమైంది.

ప్రకాశంజిల్లా చినగంజాం వాస్తవ్యులు వేగు పోలయ్య, కిష్టమ్మగారల జ్యేష్టకుమార్తె కోటమ్మతో రామాయపట్నంలో వివాహం జరిగింది. పెండ్లయిన మూడు సంవత్సరాలకు ఇద్దరు పిల్లలు జన్మించారు. అబ్బాయి పేరు శ్రీను, అమ్మాయి పేరు శ్రీదేవి. మా అన్న స్నేహితుడు సుబ్బారావు ముత్యాల వ్యాపారం చేస్తున్నట్లు చెబుతూ వచ్చేవాడు. నా సంపాదన చూసి ఒకరోజు దొంగనోట్లు వెయ్యి రూపాయలు తెచ్చి నాకు ఇచ్చి 'ఇవి మార్చుకో, కోట్లు లక్షల వ్యాపారం' అని చెప్పి నన్ను మోసపు వ్యాపారం చేయించాడు. ఇంత కష్టం చేసే కంటే తేలికగా డబ్బు సంపాదించటం మేలు అని ప్రారంభించాను. నేను ఆ వెయ్యి రూపాయలు తేలికగా మార్చుకున్నాను. అవి దొంగ నోట్లు అని చెప్పారు. కానీ అవి మంచినోట్లవలె మారాయి. తర్వాత 'లక్షరూపాయలు తీసుకొని రా! మూడు లక్షలు దొంగనోట్లు ఇస్తామ'ని కారులో వచ్చి నాతో మాట్లాడారు. నేను నా సొంత డబ్బు, నా కష్టార్జితం, ఇంకా మద్రాసులో యాభై వేలు తెచ్చి వారికి ఇచ్చాను. ఆ తర్వాత డబ్బుల కోసం నన్ను రోజు తిప్పించడం ప్రారంభించారు. మూడు నెలలు డబ్బులకోసం వాళ్ళ చుట్టూ తిరుగుతూ సినిమాలు చూస్తూ, నడిజామున ఇంటికి వచ్చి అన్నం తిని, కావలి స్టేషన్లో పండుకొనేవాడ్ని. చివరికి వాళ్లు మా దగ్గర డబ్బులు లేవు. మేము నలుగురం వాడుకున్నాము. ఎవరికి చెబుతావో చెప్పుకో! అన్నారు. నేను సైకిల్ చైను తీసుకొని వాళ్ళ వెంబడి వచ్చిన దొంగ పోలీసును కొట్టాను. అప్పుడు ఆ నలుగురిలో రమేష్ అనే అతను నన్ను కర్రతో కొడితే, చేయికి తగిలి రక్తం వచ్చింది.వాళ్ళు టీ పొడితో నా చేతికి కట్టుకట్టి రెండు వందల రూపాయలు ఇచ్చి నన్ను కావలి కచేరిమిట్ట దగ్గర రైలు పట్టాల వద్ద పడేశారు. అప్పుడు నేను రేపల్లె దగ్గర నిజాంపట్నంలో మా నాన్న స్నేహితుడు కోటయ్యకి చెప్పాను. ఆయన ఇంక వాళ్ళ జోలికి పోవద్దు. వాళ్ళు నిన్ను చంపేస్తారు అని చెప్పి కొంచెం డబ్బులు ఇచ్చి ఇంటికి పంపాడు. కాని రెండు నెలలు కావలిలోనే ఉండి, ప్రతిరోజు వాళ్ళ దగ్గరకు వెళ్ళేవాడిని. అందర్నీ డబ్బులు అడుక్కుంటూ అన్నం తిని, తెట్టు స్టేషన్లో పండుకొనేవాడ్ని. అలా రెండు నెలలు గడిచాయి. మా అమ్మ తెట్టు స్టేషన్‌కి అన్నం పంపించేది. చివరికి విసుగు పుట్టి రైలు క్రింద పడి చని పోదామనుకున్నాను.

ఒక పాత స్నేహితుడు ఎరికల వాళ్ళ కుర్రవాడు వెంకటరమణ అనే అతను వచ్చి నా వెంబడి తిరుగు, నీకు లక్ష రూపాయలు ఒక్కరోజులో వచ్చే వ్యాపారం చూపిస్తానన్నాడు. అతనితో కలసి వెళ్ళాను. చిలకలూరి పేట, మార్టూరు తిప్పారు. పగలు ఇద్దరిద్దరుగా ఊరంతా తిరిగాము. మనిషికి ఒక కత్తి, ఒక డమ్మీ తుపాకి, నడుముచుట్టూ  కంకర రాళ్ళు కట్టుకొని ఒక ఇంటికి వచ్చి నన్ను గేటు వద్ద పెట్టి, లోనికి వెళ్ళి ఇంట్లో వాళ్ళని కొట్టి డబ్బు తీసుకొని పరారయ్యే వాళ్ళము.

మార్టూరులో ఒక ఇంట్లోకి వెళ్ళి వాళ్ళని కొట్టబోయే టప్పటికి వాళ్ళ కేకలకు ఆ ఊరి వారంతా ఒక్కటై మా మీదకు వచ్చారు. మేము కట్టుకున్న రాళ్ళు వారిపై విసిరి పారిపోయాము. ఆ విధంగా రెండు మూడు నెలలు వాళ్ళ

వెంబడి తిరిగాను. వాళ్ళు అన్నం పెట్టిస్తారు. వారికి చెడ్డ అలవాట్లు ఉన్నాయి. నాకు భయం వేసేది. ఇస్తానన్న డబ్బు ఇవ్వలేదు. వాళ్ళని వదలి రామాయపట్నం వచ్చి పొలం పని చేసుకుంటు చేపల వేటకు పోతుండేవాడిని.

ఒక రోజు పొలం వద్దకు సాయంకాలము నాలుగు గంటలకు ఎరికల వ్యక్తి వచ్చాడు. రాగి చేను పెరుకు తున్నాను. అప్పుడు నన్ను నెల్లూరుకు జీపులో యస్.ఐ. తీసుకొని వెళ్ళాడు. జీపులో నన్ను కొడుతూ ఎరికల వాళ్ళ విషయం అడుగుతూ కొట్టాడు. మరలా కొట్టాలని పోలీసు స్టేషన్లో పెట్టారు. మా తల్లిదండ్రులకు కబురు చేస్తే రాలేదు. మా ఊర్లో విచారిస్తే నేను మంచివాడిని అని తెలుసుకొని, నాగేశ్వరరావు యస్.ఐ. టూటౌన్, నువ్వు ఆ ఊరిలో ఉండవద్దు. ఎక్కడికైనా వెళ్ళిపో అని నన్ను పంపించాడు. మా బంధువుల ఊరు కొత్తపట్నం వచ్చాను. ఒక బోటు ఎక్కి చేపలు పడుతుంటే విశాఖపట్నం నుండి వచ్చిన ఒక సాయెబు నన్ను విశాఖపట్నం రమ్మన్నాడు. ఇక్కడ నుండి వెళ్ళిపోతే మంచిదని నేను విశాఖపట్నం వెళ్ళిపోయాను. ఆ సాయెబు పేరు కరీము. ఇరవై రోజులలో ఐదు లేక ఆరు వేలు ఇస్తానన్నాడు. ఐదునెలల తర్వాత నా కుటుంబాన్ని తీసుకొని వెళ్ళి, విశాఖలో బీచ్ వెంబడి జాలరిపేటలో కాపురం పెట్టాను. అదివరకు నష్టం వచ్చే వేట ఇప్పుడు లాభాలు వచ్చాయి. మేనేజ్‌మెంటు అంతా నాకిచ్చి అతను వాచీల వ్యాపారం చేసుకొనేవాడు. మేమిద్దరం కలసి తాగేవాళ్ళము. తుఫాను రోజుల్లో నేను – మాకు రేడియో కొనివ్వు, తుఫాను హెచ్చరిక వింటాము అని అతనిని చాలాసార్లు అడిగాను. ఇన్సూరెన్సు కట్టుకో, మేము చనిపోయినా నీకు లక్షలు వస్తాయి అని చెప్పాను. నా మాట వినలేదు. అల్లా ఉన్నాడు అని అనేవాడు. అతనికి ఆరుగురు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలు.

ఒకసారి తుఫాను వచ్చింది. పదవ నెంబరు జెండా ఎగురవేశారు. అయిదు వందల కేజీల సన్న రొయ్య పడుతుంది. నేను నిద్రపోతున్నాను. దేవుడు మాట్లాడాడు. నువ్వు మీడియేటరుకి డబ్బు కట్టలేవు అనే మాట వినిపించింది. మీడియేటరు రామాయపట్నంలో ఉన్నాడు. ఆయనకు మా అన్నదమ్ములు ఇద్దరం కలిసి ముప్పైవేలు ఇవ్వాలి. ఆ డబ్బు కడతానని మా తమ్ముడ్ని కూడా తీసుకొని వచ్చాను. తుఫాను ఎక్కువయింది. తుఫాను ఒరిస్సా వైపు మమ్ములను తీసుకొని వెళ్తుంది. ఇంతలో బోటులోకి నీళ్ళు వస్తున్నాయి. రాత్రంతా నీళ్ళు మోటార్లుతో తోడుతున్నాము. చాలామంది బోటులను ముంచి పారిపోయి ప్రాణం కాపాడుకొన్నారు. మేము అలా చెయ్యదలచుకోలేదు. బోటును కాపాడాలని అను కొన్నాము. రెండవరోజు తుఫాను కొంచెం తగ్గింది. వెనక్కి వస్తున్నాము. చెట్లు కనబడ్డాయి. తుఫాను ఎక్కువ అయింది. సముద్రంలో అక్కడక్కడ శవాలు తేలుతూ వస్తున్నాయి. రాత్రి తొమ్మిది గంటలు అయింది. కోనార్కులో ఉన్నాము. ఒక వెలుగు నాకు కనబడు తున్నది. నేనొక్కడినే చూస్తున్నాను. ఎవరు చూడలేదు. ఎవరూ దూకవద్దు అన్నాను. మా తమ్ముడు నాతో ఉన్నాడు. బోటు మునగటం ప్రారంభమయింది. ఒడ్డు దగ్గరలో ఉందని అందరిలో పెద్దాయనను తాడు కట్టి దించాము. నువ్వు బ్రతికితే కేక వెయ్యి అన్నాము. అరగంట తర్వాత పెద్ద కేక వేశాడు. అతనికిచ్చిన తాడు ఈ కొస పట్టుకొని మిగిలిన ఆరుగురము ఒడ్డు చేరాము. ఆయిలు బనీన్లు, డ్రాయర్ల మీద ఉన్నాము. నేను లీడరును కనుక బోటుని ఒడ్డుకు లాగుదామన్నాను. మూడు నాలుగు రోజులు అన్నం లేకుండా ఉన్నాము. కోనార్క్ ఊర్లోకి వచ్చాను. 'తుని' వాళ్ళు అక్కడ ఉన్నారు. చేపలు పట్టేవారు. చంద్రబాబు గెలిచాడని ఫలహారం పంచిపెట్టారు. ఊరి పెద్దలు రెండు వందలు ఇచ్చారు. 'కుర్దా' స్టేషన్ వచ్చాము. వైజాగ్‌కి దొంగబండి ఎక్కి వచ్చాము. కరిమ్‌కు చెప్పాము. వాళ్ళు కార్లు వేసుకొని బయలుదేరారు. నేను వారితో కోనార్కు వచ్చి బోటు చూపించాను. కోనార్క్‌కి సాయంకాలం నాలుగు గంటలకు చేరాము. పదిహేను లక్షలు విలువచేసే టేకు బోటు అది. ఒరియా వాళ్ళు తగాదాకి వచ్చారు. దానిని

ముక్కలు ముక్కలుగా నరికారు. మాతో ఒక ఒరియా అతను వాళ్ళతో తగాదా వద్దని చెప్తే వైజాగ్ వచ్చాము.

చిన్నతనము నుంచి దేవుళ్ళ యెడల ఎంతో భక్తిగా ఉండే వాళ్ళం. మా పితరులందరు మా కులంలో పూజారులు. అందువలన నేను రాములవారి దేవాలయంలో పూజారిగా ఉండి సాయంకాలం ప్రతిరోజు పూజచేసి అందరికి పలహారం పెట్టేవాడ్ని. దేవతలందరికీ పూజ చేసేవాడ్ని విజయవాడ కనకదుర్గమ్మ గుడికి వెళ్ళేవాడ్ని. కొత్తపట్నం జాలమ్మ దేవర పూజలుచేసాను. ఈ దేవుళ్ళెవ్వరూ నన్ను కాపాడలేదు. తరువాత వైజాగ్ అవతల కుళ్ళు కాలవ దగ్గర మరియమ్మ గుడికి వెళ్ళడం ప్రారంభించాను. మా బాబాయి ఒకరోజు మరియమ్మ యేసు ప్రభువు తల్లే కానీ దేవుడు కాదు. యేసుప్రభువునే పూజించాలి అని చెప్పాడు. జాలరపేట ప్రక్క ఒక చర్చికి వెళ్ళటం ప్రారంభించాను. ఆ పాస్టరు ఒక బోటు డ్రైవరు. బోటులో జరిగిన దొంగతనానికి బాధ్యులమని మా స్టాఫ్ ఏడుగురిని ఆయనతో కలిపి పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్ళారు. ఇక నేను విశాఖపట్నం వదిలి కుటుంబంతో మా ఊరు వచ్చేద్దామనుకున్నాను. కరీమా బంధువులు నా మంచితనము చూసి నాకు రెండు చిన్నబోట్లు ఇచ్చి మా ఊరు వెళ్ళి చేపలు పట్టి, వారికి కొంతభాగం పంపించమన్నారు.

అక్కడ్నుంచి నేను చినగంజాము వచ్చాను. చినగంజాములో కొంతకాలం వేటకు వెళ్ళాము. అక్కడ మా చిన్నత్త ఇంట్లో పండుకొన్నప్పుడు శీను ఇల్లు కాలిపోతున్నట్లు దర్శనం వచ్చింది. అది దర్శనమని నాకు తెలియదు. అక్కడనుంచి గుండాయపాలెం వచ్చాను. అక్కడ వేట బాగా ఉంటుందని చెప్పారు.

ఒకరోజు తొలివేటలో ముప్పైవేలు రూపాయలు ఖరీదు చేసే సొరచేప పడింది. దానిని అమ్మి మరలా వేటకు వెళ్ళాను. అక్కడ కొందరు వ్యక్తుల వలన వేట తాళ్ళు పాడయ్యాయి. కొన్ని హింసలు కలిగాయి. కొత్తపట్నం వచ్చాను. కొత్తపట్నంలో ప్రార్థనకి వెళ్లడం ప్రారంభించాను. వైజాగ్ నుండి ఒక పాస్టరుగారిని కొత్తపట్నం పిలిపించాను. అతను నా ఇంట్లోనే ఉండి 'చిన్నమంద' అనే పేరుమీద ఆరాధన నడిపించేవాడు. అతని పేరు పౌలు. నాకు ఆయన బాప్తిస్మం ఇచ్చాడు. నాకు అప్పుడు ఐదు బోట్లు ఉన్నాయి. ఆదివారం బోట్ల వేటకు వదలవద్దని ప్రభువు చెప్పాడు. అయినా నేను ఆదివారం కూడా బోట్లు వదులుతున్నాను. అందరికి చేపలు పడేవి కానీ, నాకు పడేవికావు. బోట్లు కూడా దెబ్బతిన్నాయి. అప్పుడు నేను ప్రభువుకు ప్రార్థించి, క్షమాపణ అడిగాను. ఆదివారం వేట మానేశాను. అప్పటి నుండి ఎవరికి పడకపోయినా రొయ్య నాకు పడేది. బాగా సంపాదన పెరిగింది. ఇల్లు స్థలం కొని గవర్నమెంటు ఇచ్చిన ఆరు సెంట్లు దానికి తోడు చేసి ఇల్లు కట్టాను. పల్లెపాలెం పెద్ద ఊరిలో ప్రార్థన పెట్టమన్నాడు. పౌలు విశాఖ వెళ్ళిపోయాడు. శ్యామలమ్మకి నా ఆస్థి అమ్మి, ఋణాలు తీర్చాను. దేవుని ప్రార్థన చేశాను. 25 సెంట్లు నలభై వేల రూపాయలకు కొన్నాను. రెండు రూపాయల వడ్డీకి ఇరవై సెంట్లు కొన్నాను.

ఎల్లమ్మ, మా కుటుంబం కలిసి చర్చి కట్టాము. మణెమ్మ, ఎల్లమ్మ, ఆనందం, నేను, నా భార్య కూడా కలిసి పనిచేసాము. ఒక్కరు కూడా ఒకరూపాయి సహాయం చెయ్యలేదు. శ్యామలమ్మ ద్వారా ఆ స్థలం దేవుడు నాకిచ్చి ఒక దారిచూపాడు. తర్వాత రాజమండ్రిలో దహించు అగ్ని థామస్‌గారి దగ్గర చేరి బైబిలు ట్రైనింగు అయ్యాను. నా భార్యకు బాప్తిస్మం అక్కడే ఇచ్చారు. ఇప్పుడు ఆమె పేరు కృపమ్మ, నా పేరు నతనయేలు, అబ్బాయి పేరు విల్సన్‌రాజు, అమ్మాయి పేరు శ్రీదేవి.


ఇప్పుడు పల్లెపాలెంలో పెద్ద ఊరు దగ్గర కారుణ్య నగర్‌లో బేస్తవారు అరవై కాపురాలు ఉన్నాయి. అక్కడ ఆరాధన చేస్తున్నాను. పల్లెపాలెంలో బీచ్ దగ్గర ఒక ఆరాధన నడిపిస్తున్నాను. ప్రభువు నాకు దర్శనాలిచ్చాడు. క్రొత్తపట్నంలో కృపమ్మ వాళ్ళ నాయనమ్మ ఇంట్లో

**(మిగతాది 23వపేజిలో)**

2

# బైబిల్ ప్రాముఖ్యత

ఈ పరిశుద్ధ గ్రంథము దేవుని ప్రణాళికను మానవుని పాప పరిస్థితిని వాని రక్షణ మార్గమును పరిశుద్ధుల ఆశీర్వాద మైన నిరీక్షణను తెలియపరచుచున్నది. ఇది దేవుని వాక్కు ఈ వాక్కు ద్వారా తనను తాను ప్రజలకు ప్రత్యక్షపరచుకున్నాడు. తన చిత్తమును బయలుపరచుచున్నాడు. సృష్టిపై సర్వాధికారం కలిగిన బలమైన వాక్కు (ఆది. 1వ అధ్యా, 2 పేతురు 3:5,6) యెహోవా వాక్కు యధార్ధమైనది (కీర్తనలు 33:4). ఆకాశము భూమి గతించిపోవును గాని ఆయన మాటలు గతింపవు (మత్తయి 24:35). ఇది దేవునితో ప్రారంభింపబడి దేవునితో అంతమగుచ్నుది. ఒక భక్తుడు ఈ పరిశుద్ధ గ్రంథమును 'ప్రయాణికుని పటము', 'యాత్రికుని దుడ్డుకర్ర', 'నావికుని చుక్కాని', 'సైనికుని ఖడ్గము', 'క్రైస్తవుని పతాకము' అని వర్ణించాడు.



ఈ పరిశుద్ధ గ్రంథము 66 పుస్తకాల కలయిక. పాత నిబంధన, క్రొత్త నిబంధన అను రెండు భాగా లుగా విభజింపబడినది. పాత నిబం ధన క్రీస్తు జననమునకు ముందు, క్రొత్తనిబంధన క్రీస్తు తర్వాత వ్రాయబడినవి. పాతనిబం ధనలో 39 పుస్తకములు, క్రొత్తనిబంధనలో 27 పుస్తకాలు ఉన్నవి. చాలామంది ఈ పుస్తకాల సంఖ్యలను జ్ఞాపక ముంచుకొనుటకు కష్టపడు తుంటారు. సులభంగా గుర్తుంచుకొనుటకు ఒక చిన్న చిట్కా Old Testament (పాత నిబంధన), New Testament (క్రొత్తనిబంధన) లలోని అక్షరాల సంఖ్య 3,9గా గమనించగలం. Old Testament లోని పుస్తకములను 39గాను, New Testamentలోని పుస్తకాలను 3×9=27గాను జ్ఞాపకముం చుకొనగలము. పాతనిబంధనలో (39), క్రొత్త నిబంధనలో (27) ఈ 66 పుస్తకములను దాదాపు 40 మంది దేవుని భక్తులు హెబ్రీ, కల్దీయుల భాష (కొన్ని చిన్నభాగాలు), గ్రీకు, అరామిక్ (కొన్ని చిన్నభాగాలు), అను నాలుగు వేర్వేరు భాషలలో 1600 సం॥లు వేర్వేరు కాలాలలో వ్రాసి యున్నారు. ఈ విధంగా అనేకమంది వివిధ కాలాలలో, వివిధ పరిస్థితులలో వ్రాసినా ఒకే విషయంలో అనగా క్రీస్తు మానవాళికి కలుగజేసిన రక్షణను గూర్చి ఐక్యత కలిగి యున్నారు. గ్రంథ ఆరంభం మొదలుకొని గ్రంథ అంతం వరకు ఒకే విషయాన్ని ప్రస్తావించుటలో దేవుని యొక్క ఆలోచన. సమ్మిళితమై ఉంది. పాతనిబంధన అంతటిలో పాప పరిహారముకై దేవుని కుమారుని రాకను, క్రొత్త నిబం ధనలో దేవుడు తానే శరీరధారిగా జన్మించి తన ప్రాణమును పెట్టి పునరుత్థానుడై తిరిగి రానైయున్న క్రీస్తును గూర్చి వ్రాయబడినది. పాతనిబంధన క్రీస్తు జన్మ ప్రవచనమైతే, క్రొత్త నిబంధన ప్రవచన నెరవేర్పు.

ఈ పాతనిబంధనలో మొదటి 5 పుస్తకములైన ఆదికాండం నుండి ద్వితీ యోపదేశకాండం వరకు ధర్మశాస్త్ర మనియు, యెహోషువ మొదలు నెహెమ్యా వరకు ఉన్న 12 పుస్తకా లను చరిత్ర అనియు యోబు మొదలు పరమగీతము వరకు ఉన్న 5 పుస్తకాలను పద్య భాగములనియు యెషయా మొదలు దానియేలు వరకు ఉన్న 5 పుస్తకాలను పెద్ద ప్రవక్తలనియు హోషేయ మొదలు మలాకీ వరకు ఉన్న పన్నెండు పుస్తకములను చిన్న ప్రవక్తలనియు పిలువబడినవి. క్రొత్త నిబంధనలోని 27 పుస్తకాలలో మొదటి 4 పుస్తకా లను అనగా మత్తయి మొదలు యోహాను వరకు సువార్త లనియు, అపొస్తులుల కార్యముల గ్రంథమును ఆదిసంఘ చరిత్రయనియు, రోమా పత్రిక మొదలు ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక వరకు ఉన్న 13 పత్రికలను అపొస్తలుడైన పౌలు వ్రాసిన పత్రికలుగా మరియు హెబ్రీయులకు వ్రాసిన పత్రికను కూడా పౌలు వ్రాసిన పత్రికగా సంఘ చరిత్ర కారుల అభిప్రాయం. యాకోబు వ్రాసిన పత్రిక మొదలు యూదా వ్రాసిన పత్రిక వరకు ఇతర భక్తుల పత్రికలుగాను, ఆఖరి పుస్తకమైన ప్రకటన గ్రంథమును ప్రవచన గ్రంథము లేదా దర్శన గ్రంథముగాను వర్ణించబడినవి.

ఆదిమ బైబిల్ వ్రాత ప్రతులు ఏ ఒక్కటీ ఇప్పుడు లేవు. అవి మరుగున పడక మునుపే ఆదిమ భక్తులు అతి జాగ్రత్తగా వాటిని "ప్యాచ్మెంట్" అను జంతు చర్మముల మీదను, "వెల్లుమ్" అను లేగ దూడల చర్మములపై, "పాపిరస్" అను చెట్టు బెరడుతో చేసిన కాగితపు చుట్టలపై ఎత్తి వ్రాసిరి. వీటిని ఎంతో జాగ్రత్తగా కాపాడుకొనుచు తదుపరి జనాంగమునకు అందించి యున్నారు. ఇలా ఎత్తి వ్రాయబడిన ప్రతులు క్రీస్తుకు పూర్వమే ఐగుప్తీయుల ఎడారులలో కనుగొనబడినవి. తర్వాత ఈ మధ్య కాలములో 1947లో యెరికో పట్టణానికి 13 కి.మీ. దూరంలో ఉన్న "ఖుమ్రాన్" గుహలలో యెషయా, హబక్కూకు గ్రంథములు, హోషేయ, మికా, నహూము అలాగే మరికొన్ని పుస్తకాలు హెబ్రీ భాషలో వ్రాయబడిన వ్యాఖ్యానాలు దాదాపు 800 కాగితపు చుట్టలు కనుగొనబడినవి. వాటి ఆధారంగా ఇప్పుడు పరిశుద్ధ గ్రంథమును 1600 వేర్వేరు భాషలలోనికి తర్జుమా చేయబడినది. ఇంకనూ వేర్వేరు భాషల లోనికి తర్జుమాకై ప్రయత్నాలు జరుగుచున్నవి. 15వ శతాబ్దంలో అచ్చు యంత్రం ఐరోపా ఖండంలో కనుగొనక ముందు ఈ లేఖనాలు అతి కష్టంగా చేతి వ్రాతలతో కొంచెము సంఖ్యలో ఉన్నవి. ఒక పుస్తకమును ఎత్తి వ్రాయుటకు ఎంతో ప్రయాస ఎంతో సమయము పట్టెడిది. అయితే ఇప్పుడు ఈ అచ్చు యంత్రము ద్వారా వేల సంఖ్యలో ముద్రించుచున్నారు. అప్పటిలో కొద్దిమంది వద్దనే ఈ బైబిల్ ఉండెడిది. ఇప్పుడు అందరికీ అందుబాటులో ఉండినది.

రాజ్యాలు, వాటి సంస్కృతులు మారుతున్నాయి. దశాబ్దాలు గడిచే కొద్ది ఎన్నో మార్పులు వచ్చాయి. పరిశుద్ధ గ్రంథం ఈ విధంగా భద్రపరచబడి అందరికి అందుబాటులోకి ఉండేలా అన్ని భాషలలోకి తర్జుమా చేయబడింది. బైబిల్ వ్రాయబడుటకు దేవుడు తన బిడ్డలను ఏ విధంగా తన పరిశుద్ధాత్మచే ప్రేరేపింపబడి, ఆత్మావేశము విధంగానే బైబిల్ భద్రపరచబడి, తర్జుమా చేయబడి ఒక తరము నుండి మరొక తరమునకు అందించాడు, అందించుచున్నాడు.

ఈ బైబిల్ ఇంగ్లీషు భాష కంటే ముందు ఆదిమ భాషలైన గ్రీకు, సిరియా (Syrian), కోప్టిక్ (Coptic), గోతిక్ (Gothic), లాటిన్లలోకి తర్జుమా చేయబడింది.

ఐగుప్తు దేశములో క్రీ.పూ. 331లో అలెగ్జాండ్రియా అనే పట్టణం అలెగ్జాండరు ద్వారా స్థాపించబడినది. అంతకు పూర్వమే అనేకమంది యూదులు ఈ ప్రాంతమునకు వలస వచ్చి స్థిర నివాసమేర్పరచుకున్నారు. వీరికి గ్రీకు భాష తప్ప వారి పితరుల భాషయైన హెబ్రీ భాష తెలియదు వీరికి అందుబాటులో ఉండుటకు క్రీ.శ. 200లో పాతనిబంధన గ్రీకు భాషలోనికి తర్జుమా చేయుటకు ప్రారంభించి మొదటి ఐదుకాండములను ముగించిరి. ఈ తర్జుమాను 70 మంది ఇశ్రాయేలీయుల పెద్దలను అలెగ్జాండ్రియా రప్పించి వారిచే ఈ 5 కాండములను తర్జుమా చేయించిరి. ఈ గ్రీకు పాత నిబంధనను సెప్టూజియంట్ (Septugiant) అంటారు. ఇప్పటికి ఈ గ్రీకు పాతనిబంధన గ్రీకు సంఘాలలో విరివిగా వాడబడుచున్నది. ఆదిమ సంఘము ద్వారా అంగీకరింపబడిన నూతన నిబంధన తర్వాత ఈ సెప్టూజియంట్ (గ్రీకు పాత నిబంధన)తో చేర్చబడి పూర్తి బైబిల్‌గా అక్కడ వాడుకొనుచున్నారు. ఇంకొక ముఖ్య విషయమేమిటంటే ఇప్పటికి ఇతర భాషలలోనికి బైబిలును తర్జుమా చేయు సమయంలో ఈ గ్రీకు బైబిలును కూడా రెఫర్ చేస్తున్నారు. తూర్పు ఉత్తర దిక్కులకు మధ్యలోనున్న ఉత్తర మెసపటోమియా (Mesopotomia) ప్రాంతంలో ఉన్న హెబ్రీ జాతి వారికి కూడా వారి భాష రాదు. వీరికి అందుబాటులో ఉండుటకు మొదటిగా పాత నిబంధనను సిరియా భాషలోకి అనువదించారు. తరువాత కొత్తనిబంధనను అనువదించారు.

క్రైస్తవ్యం ఏ విధంగా ఐగుప్తులోనికి ప్రవేశించిందో తెలియక పోయినా యేసయ్య, పన్నెండుమంది శిష్యుల కాలంలోనే ఐగుప్తులో చాలామంది క్రైస్తవులు ఆదిసంఘ కాలంలోనే ఉన్నారు. వీరికి అందుబాటులో ఉంది. కోప్టిక్ భాషలోకి బైబిలును అనువదించారు. కోప్టిక్ ఐగుప్తీయుల భాష, క్రీ.శ. 4వ శతాబ్దిలో బిషప్ ఉల్ఫలాస్ బైబిలును గోతిక్ భాషలోకి అను వదించాడు. ఈ గోతిక్ భాష ఇంగ్లీషు, జర్మనీ, డట్చ్, స్కాండనేవియా భాషలకు మూలభాష. క్రీ.శ. 2 శతాబ్దంలో గ్రీకుల ఆధిపత్యం అంతరించి రోమనుల ఆధిక్యత ప్రబలుచున్న కాలంలో లాటిన్ భాష సంస్కృతి విస్తరించింది. ఈ కాలములో లాటిన్ బైబిల్ అవసరమని గుర్తించిన రోము బిషప్ దమసస్ (Damasus) (క్రీ.శ.366-384) తన సెక్రటరీ అయిన జెరోము (Jerome)కు ఈ అనువాద పని అప్పగించాడు.

**(సశేషం)**

# మదర్ తెరీసా

అదే సమయంలో జర్మనీలోని నాజీ పార్టీ అడాల్ఫ్ హిట్లర్ నాయకత్వంలో వెళ్ళూనుకుంటున్నది. ఇటలీలో మరో హిట్లర్ అయిన ముస్సోలినీనాయకత్వంలో సమాజ పతనానికి నాంది కానుంది. హిట్లర్‌తో ముస్సోలినీ చేతులు కలిపాడు. ఇలాంటి ప్రపంచ పరిస్థితులలో సిస్టర్ తెరీసా తనకు ప్రభువు అప్పగించిన పని చేసుకుంటూ వెళ్తున్నది. బెంగాలీ భాష నేర్చుకుంది. ఇప్పుడు ఆమెకు అయిదు భాషలు వచ్చును. ఆల్బేనియన్, సెర్బోక్రోయేషియన్, లాటిన్, ఇంగ్లీషు మరియు బెంగాలి.

1935లో సిస్టర్ తెరీసాకు 25 సంవత్సరాల వయస్సు. ఆమె తన జీవితంలోని ప్రతి నిమిషం దేవుని సేవలోనే గడుపుతుంది. ప్రపంచంలోని ఏ పరిస్థితిలోను ఆమె చలించ లేదు. ఎందుకంటే ఆమె విశ్వాసం కాలగతులు ప్రభువు చేతుల్లో వున్నాయని, ఆయన ప్రణాళికను ఏ మానవుడూ తిరిగగొట్టలేడని ఆమెకు తెలుసు. కనుకనే నిశ్చింతగా వుండేది. అలాగని ప్రపంచంలో జరిగినవన్నీ మెచ్చుకొనేది కాదు. అనేక విషయాలు అపవాది వలన జరుగుచున్నవని, చాలా వరకు సాతాను తంత్రాలు లోకంలో వున్నాయని సిస్టర్ తెరీసా తెలుసుకుంది. 1935లో ముస్సోలినీ ఇథియోపియా దేశాన్ని ఆక్రమించినప్పుడు ఆమె బాధపడింది. మరి ముఖ్యంగా కలకత్తాలోని నిరుపేదలు, అసహనంగా పడివున్న వృద్ధులు, దిక్కులేని వారి గురించి ఆమె హృదయంలో ఎంతో వేదన పడేది. దేవునికి ఆమె అభ్యర్థన ఏమంటే ఈ నిరుపేద, నిస్సహాయ ప్రజలకు సేవచేసే భాగ్యాన్ని, వారి జీవితాల్లో వెలుగునిచ్చే శక్తిని ప్రసాదించమని.

మదర్ తెరీసా గురించి తెలుసుకునేటప్పుడు ఆమె జీవించిన కాలము గుర్తుంచుకోవాలి. ఆమె 1910 ఆగష్టు26న పుట్టి 1929 జనవరి 6న కలకత్తా చేరింది. ఇండియాలో స్వాతంత్ర్య ఉద్యమం అపుడే ఉధృతమైంది. రెండవ ప్రపంచ యుద్ధంవల్ల వివిధ దేశాలలో చోటు చేసుకున్న సంఘటనలు ఆమె జీవితములో కొన్ని ఘట్టాలుగా ఉన్నాయి గనుక వాటిని కూడ మనం తెలుసుకుందాం. ప్రతివ్యక్తి జీవితం ఒక గొప్ప చరిత్ర. ప్రతివ్యక్తి పట్ల మన ప్రభువైన యేసుక్రీస్తుకు ఒక ప్రణాళిక వుంది. వారి వారి మనోచిత్తమునుబట్టి వారి జీవితాలు మలచబడి ఆఖరుకు ప్రభువు ప్రణాళిక నెరవేరుతుంది. మనం ఆయన చేతిలో ఎటువంటి పాత్రగా వాడబడ్డామనేది మనకు తెలుస్తుంది కదా!

1937 మే 24న సిస్టర్ తెరీసా డార్జిలింగ్‌లో తన ఆఖరు వాగ్దానాలు చేసింది. పేదరికం, పరిశుద్ధత, విధేయత – ఈ మూడు వాగ్దానాలలో తన శరీరం, మనసు, ఆత్మ దేవునికే అర్పితమైనవి. అందరి ఎదుట దేవుని సమక్షంలో మనస్ఫూర్తిగా ఒప్పుకుంది. ఈనాటి నుండి సిస్టర్ తెరీసా 'మదర్ తెరీసా' అయ్యారు. ఆమె టీచరుగా పనిచేస్తున్న హైస్కూలుకు ప్రిన్సిపాల్‌గా నియమించబడినారు. కాని ఆమె హృదయం కడు నిరుపేదల సేవకై కొట్టుకుంటూనే వుంది. ప్రతిసారి రిట్రీటుకు వెళ్ళేటప్పుడు తన హృదయంలో బాధ పడుతూ వుండేది. ఆమె ఇప్పుడు చేస్తున్న సేవ పేద పిల్లలకు చేస్తుందిగాని కడుబీదలైన పెద్దవారి సంగతేమిటి? అప్పుడప్పుడు కలకత్తాలోని మురికి వాడల గుండా వెళ్తుంటే వీధులలో పేదవారు, నిర్భాగ్యులు కొల్లలుగా కన్పించేవారు. ఆమె వారి వద్దకు చేరలేకపోతుంది. అయితే తను వాగ్దానం చేసినపుడు లొరిటో సిస్టర్స్ రూల్సు ప్రకారం నాలుగు గోడల మధ్యనే వారి సేవా కార్యక్రమం కొనసాగించాలని, అది వారి విధేయతకు ముఖ్యమైనది. కాని పేదవారిని దర్శించేందుకు ఆదివారము అనుమతి పొందింది. అయినా తన గుండెల్లో బాధ. ఏమీ చేయలేకపోతున్నానని తలంచుకుంటూ వుండేది.

అదే సమయంలో తన తల్లి దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది. "నా ప్రియమైన కుమార్తెకు, నీవు ఇండియా దేశానికి వెళ్లింది పేదల సేవ కొరకని మర్చిపోవద్దు. నీవు చిన్నతనంలో నాతో వచ్చినప్పుడు ఎంతోమంది గాయాల్ని మాన్పుట చూశావు. కొందరు ఏకాకిగా ఈ ప్రపంచంలో వున్నప్పుడు మనం ఆదుకున్నాము. వారి బాధ వారి కురుపులు గురించో, శరీరబాధలు గురించో కాదుగాని, ఒంటరినై వున్నానని, ఎవరూ తోడులేరనే అభాగ్యస్థితిలోనే ఎక్కువగా బాధపడేవారు. వారి కుటుంబంలో వారికి ఆదరణ కొరతగా వున్నదని

బాధపడే వారు. వారిని ఆదరించుటలో వారికి, మనకు ఎంతో తృప్తి కలిగేది". ఈ ఉత్తరం చదివి ఎంతో దూరంలో వున్న తల్లికి తన సంశయం అర్థమైనట్లుందని అనుకుంది. వీటన్నిటికి మూలం ప్రేమ. పేదవారికి కావల్సింది ప్రేమ. వారికి చేసే సేవలో ప్రేమ నిరూపించబడుతుంది. ప్రేమ ప్రేమనే కోరుకుంటుంది. మదర్ తెరీసా తన జీవితంలో క్రొత్త ఎత్తులకు ఎదుగుతుంటే–పేద వారికి దూరమవుతున్నానని హృదయంలో నొచ్చుకుంటుండేది. ఆ బాధకు పరిష్కారం ప్రభువైన యేసే ఒకరోజు చూపిస్తాడనే నిరీక్షణలో కాలం గడుపుతూ వుంది.

1939లో ఇటలీ ఆల్బేనియాను ఆక్రమించింది. మదర్ తెరీసా అన్న లాజర్ ఓడిపోయిన ఆల్బేనియా ఆర్మీ ఆఫీసర్. ఆయన ఇటలీ దేశస్థురాలిని పెండ్లి చేసుకున్నాడు. గనుక యుద్ధం తరువాత ఇటలీకి చేరుకోగలిగాడు. 1940లో జర్మనీ, ఇటలీ, జపాన్‌లు ఒక్కటైనాయి. డిసెంబరు 7, 1941 తేదీన జపాన్ వాళ్లు అమెరికా పెర్ల్‌హార్బర్‌పై బాంబుల వర్షం కురిపించారు. ఏప్రిల్ 6, 1942న జపాన్ మద్రాసుపై బాంబు వేసింది. మహాత్మాగాంధీ కావాలన్నా, వద్దన్నా ఇండియా రెండవ ప్రపంచయుద్ధంలో భాగమయ్యింది.

బెంగాల్ ప్రావిన్స్‌లో వరి విస్తారంగా పండుతుంది. యుద్ధం మొదలైన దగ్గర్నుండి వేలకొలది పడవల్లో బియ్యాన్ని నగరాలకు తరలిస్తున్నారు. యుద్ధ సమయంలో ఆహార పదార్థాలు సమృద్ధిగా నిలువ చేసుకొనుటకు బ్రిటీషు వారు చర్యలు తీసుకున్నారు. ఈ చర్యల వలన 1943లో బెంగాల్ ప్రజలు ఆహార కొదువ ఏర్పడి కరువు కోరల్లో చిక్కుకొని ఆకలి బాధతో ఎంతోమంది చనిపోయారు. తల్లి రొమ్ములోని పాలు ఇంకిపోయి బిడ్డలు చనిపోయే పరిస్థితికి చేరుకున్నారు. ఈ విధంగా చనిపోయిన వారి సంఖ్య ఇరవై లక్షలంటే ఆశ్చర్యంగా వుందా? కాని దేవునికి తెలుసు ఎంతమంది ఖచ్చితంగా చనిపోయారో. భారత ప్రజలు చచ్చినా బ్రతికినా పట్టింపులేదన్న బ్రిటీషు ప్రభుత్వ వైఖరికి మదర్ తెరీసా బాధపడిందిగాని వారిని ఎదిరించే శక్తి ఆమెకు లేకపోయింది. రోమా సామ్రాజ్యంలోని పాప భూయిష్టమైన నాయకులను సెయింట్ పాల్ ఎదిరించాడు గదా అని జ్ఞాపకం చేసుకుంది. అదే సమయంలో కొందరు భారతీయులు జపాన్ సైన్యంతో చేతులు కలిపారు. వారి ఉద్దేశ్యమేమంటే, ఆసియా ఖండం ఆసియా వాసులకే అనే నినాదం. 1944లో జపాన్ ఇండియాను ఆక్రమించుకునే ప్రయత్నం చేసింది ఇంఫాల్ నగరాన్ని స్వాధీనం చేసుకుని ముందుకు సాగుతుంది. అప్పుడు మదర్ తెరీసా ఏమని పిలుపునిచ్చిందంటే వర్షాలు పడాలని అందరూ ప్రార్థన చేయండి. ఈ మారణకాండ ఆగాలంటే వర్షాలు వస్తేనే వీలవుతుందని చెప్పింది. వారి ప్రార్థనలు ఫలించి పెద్ద వర్షాలు రావడంతో జపాన్ సైన్యాన్ని వెనక్కు తరమగలిగారు.

ఈ యుద్ధంలో పరిస్థితులకు బ్రిటీషు సైన్యం నెమ్మదిగా సిలోను గుండా వారి దేశానికి పోవడానికి ప్రారంభించింది. భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వడానికి బ్రిటీషువారు అంగీకరించారు. స్వతంత్ర భారతదేశం ఏ విధంగా వుండాలి, ఎన్ని రాష్ట్రాలుగా వుండాలి అనే విషయాలు మహాత్మాగాంధీ, ఎమ్.ఏ. జిన్నాతో చర్చలు మొదలుపెట్టారు. భారతదేశం ఒకేదేశంగా వుండాలని గాంధీగారు ప్రతిపాదించారు. అందుకు జిన్నా వ్యతిరేకించారు. 1945 జూలైలో బ్రిటన్ ఎన్నికల్లో విన్‌స్టన్ చర్చిల్ ఓడిపోయారు. ఆయన ఓడిపోవడం ఇండియా స్వాతంత్ర్యానికి వున్న పెద్ద అవరోధం తొలగిపోయింది. క్లెమెంట్ అట్లీ బ్రిటన్ ప్రధానమంత్రి అయ్యారు. 1945 సెప్టెంబరులో ఇండియా స్వాతంత్ర్యాన్ని ఒప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే హిందూ, ముస్లీం మతాల మధ్య చిచ్చురేగింది. అగ్ని దావాలనంలాగా కలకత్తా అంతా పాకి పోయింది. వీధుల్లో రక్తం మడుగులై పారింది. మహాత్మాగాంధీ శాంతి నెలకొల్పాలని ప్రయత్నించినా ఏ మాత్రం వినేట్లు లేరు. నగరమంతా బ్రిటీషు సైనికులతో నిండిపోయింది. నిత్యావసర ఆహార సరుకుల సరఫరా నిలిచిపోయింది. 300 మంది పిల్లలకు భోజనం ఎలా పెట్టాలి అని మదర్ తెరీసా ప్రార్థన చేయటం మొదలు పెట్టింది. ఆమెకు జవాబు దొరికినట్లుగా వెంటనే లేచి వీధుల్లోకి వెళ్లింది. ఎందరో వారిస్తున్నా వినకుండా సైనికులు వెళుతున్న వాహనాలకు అడ్డంగా నిలబడి తన పిల్లలు 300 మంది ఆకలితో మరణిస్తారని వారికి చెప్పింది. ఓ సైనికాధికారి ఆమెకు వెంటనే కొన్ని ట్రక్కుల బియ్యాన్ని, పప్పు ధాన్యాల్ని లారిటో హాస్టల్‌కు పంపాడు. **(సశేషం)**

# తల్లిదండ్రులారా!

మీ బిడ్డలను దేవునియందలి భయభక్తులలో పెంచడం వలన వారికెంత ప్రయోజనమో మీకు కూడా అంతే ప్రయోజనం ఉంటుంది. దేవునియందలి భయభక్తులలో పెరిగే పిల్లలు తల్లిదండ్రులకు లోబడి ఉంటారు. *'నీ తండ్రిని నీ తల్లిని సన్మానించుము' (నిర్గమ. 20:12)* అన్న వాక్యానికి కట్టుబడి ఉంటారు. చెడు సహవాసాలకు దూరంగా ఉంటారు, పెద్దలను గౌరవిస్తారు, ఇతరులను ప్రేమిస్తారు, నీతినిజాయితీగా జీవిస్తారు. దేవునియందు భయభక్తులు లేని పిల్లలు, చెడు సహవాసాలు చేసి, అల్లరిచిల్లరిగా తిరుగుతూ, చెడు అలవాట్లకు బానిసలై, తల్లిదండ్రులను దూషిస్తూ, సమాజానికి చీడపురుగులుగా తయారవుతారు. పిల్లలకు మీరు చెడు నేర్పించకపోవచ్చు, కానీ మంచి నేర్పించక పోవడం వల్ల వారిలో ఉన్న చెడు స్వభావం పెరిగి పెద్దద వుతుంది. *'బాలుని హృదయములో మూఢత్వము స్వాభావిక ముగా పుట్టును శిక్షాదండము దానిని వానిలోనుండి తోలివేయును' (సామెతలు 22:15)*. పిల్లలకు మంచి ఏదో, చెడు ఏదో తెలియకపోవడం వలన, సమాజంలో మంచి కన్నా ఎక్కువగా ఉన్న చెడు త్వరగా అలవరుతుంది. అందుకని పిల్లలకు మంచి నేర్పించాలి. మనం భూమిలో ఏదైనా విత్తనం నాటిన తరువాత, అది మొలకెత్తినప్పుడు, దాని రక్షణకోసం దాని చుట్టూ కంచె వేస్తాము. అలాగే పిల్లలు పెరిగి పెద్దయ్యే వరకు వారికి వాక్యమనే కంచె వేయాలి. అప్పుడు పిల్లలు సురక్షితంగా ఉంటారు. బిడ్డలను **'నిజంగా ప్రేమించే'** తల్లిదండ్రులు, వారిని దేవునియందలి భయ భక్తులతో పెంచుతారు. ఎందుకంటే, సమాజంలో దొంగత నాలు, మోసాలు, హత్యలు, మానభంగాలు చేసే వారికి తల్లిదండ్రులు లేకనే వారు అలా తయారయ్యారా? పిల్లలు ఎవరైనా తప్పు చేస్తే, వారిని ఏమి అనరు కానీ, 'తల్లి దండ్రులు వారిని అలా పెంచారు' అని వారి తల్లిదండ్రులనే తప్పు పడతారు. అంటే అటు దేవుని ముందు, ఇటు మనుష్యుల ముందు కూడా **'దోషులుగా'** నిలబడతారు. బిడ్డలను అలా పెంచే తల్లిదండ్రులు వారిని 'నిజంగా' ప్రేమించినట్లా? స్వార్థపరులైన తల్లిదండ్రులు మాత్రమే బిడ్డలను దేవునిలో కాకుండా, లోకానుసారంగా పెంచు తారు. ఎందుకంటే, తమ బిడ్డలను దేవునిలో పెంచాలనుకొనే వారు బిడ్డల ముందు సాక్ష్యార్థమైన జీవితం జీవించాలి. 'అబద్ధాలు చెప్పకూడదు' అని బిడ్డలకు చెప్పి, తల్లిదండ్రులు అబద్ధాలు చెప్తుంటే, తల్లిదండ్రులు చెప్పేవాటిని పిల్లలు విశ్వసించరు. తమ వ్యక్తిగత సుఖంకోసం, సంతోషంకోసం బిడ్డలను పట్టించు కోకుండా గాలికి వదిలేసే తల్లిదండ్రులు స్వార్థపరులు కాక ఇంకేమవుతారు? ఎంతసేపటికి బిడ్డలని బాగా చదివిస్తున్నాము అని తల్లిదండ్రులు సంబరపడిపోతారే తప్ప, చదువు వారి వ్యక్తిగత జీవితాన్ని మార్చగలుగుతుందా? చదువుకున్న పిల్లలు పెద్దవారైన తరువాత, వారి చదువును బట్టి ఎలాంటి పాపము లేకుండా జీవించగలుగుతున్నారా అనేది పట్టించుకోరు? అబద్ధాలు చెప్పకుండా, మోసం చేయకుండా, వ్యభిచారం చేయకుండా, దొంగతనం చేయకుండా ఉండేవాళ్ళు నూటికో కోటికో ఒకరుంటారేమో. చదువు సంస్కారం నేర్పుతుందేమోగాని, పాపము చేయ కుండా ఆపలేదు. అలాగని బిడ్డలని చదివించకూడదని కాదు. అంతకంటే ముందు వారిని దేవునియందలి భయభక్తులతో పెంచాలి. *'యెహోవాయందు భయభక్తులు గలిగి యుండుట జ్ఞానమునకు మూలము' (సామెతలు 9:10)*. **మీ బిడ్డలు దేవునియందలి భయభక్తులతో పెరగటం దేవుని చిత్తమై యున్నది.**

చిన్నబిడ్డలు దేవునియందలి భయభక్తులతో పెరగటం సాతాను అస్సలు సహించ లేదు. ఎందుకంటే, 60 సం॥ల వాళ్ళు దేవున్ని నమ్మితే, మహా అయితే 10సం॥లు దేవుని సేవ చేయగలరేమో, 30 సం॥ల వారు దేవున్ని నమ్మితే, 40సం॥లు దేవుని సేవ చేయగలరు. అదే 10 సం॥ల పిల్లలు దేవునిలో ఎదిగితే వారు 60సం॥లు దేవుని సేవ చేయగలరు. అందుకే పిల్లలు దేవునిలో ఎదగటం ఇష్టం లేని సాతాను, వారి తల్లిదండ్రులను లక్ష్యము చేసుకొని ప్రణాళికలు రచిస్తుంది. కాబట్టి, మీ బిడ్డలను దేవునియందలి

భయభక్తులతో పెంచకుండా సాతాను ప్రణాళికలో భాగమవుతున్నారు. ఎవనిని మ్రింగుదునా అని గర్జించు సింహమువలె తిరుగుతున్న సాతానుకి మీ బిడ్డలను అప్పగిస్తున్నారు. 2రాజులు 2:23,24 వచనాలు చూస్తే, కొంతమంది పిల్లలు ప్రవక్తయైన ఎలీషాను చూచి 'బోడివాడా ఎక్కిపొమ్ము' అని అపహాస్యం చేయగా, అతడు వారిని శపింపగా అడవిలో నుండి రెండు ఆడు ఎలుగుబంట్లు వచ్చి, ఆ పిల్లలలో 42 మందిని చీల్చివేసెను అని వ్రాయబడివుంది. ఒక్కరోజులో అంతమంది పిల్లలు చనిపోవడానికి ఎవరు కారణం? సాతాను ప్రణాళికలో భాగంగా ఉన్న తల్లి దండ్రులే కదా! పెద్దలంటే గౌరవమర్యాదలు నేర్పకపోవడం వల్లనే కదా వారి బిడ్డలు బలి అయ్యారు. వారిలో ఒకే కుటుంబానికి చెందిన పిల్లలు ఎంతమంది ఉన్నారో తెలీదు. నేటికాలంలో ఒకేరోజు 42మంది పిల్లలు చనిపోతే ప్రపంచమంతా చాలా పెద్ద న్యూస్ అవుతుంది కదా! సుమారు 3 వేల సం॥ల క్రితం జరిగిన సంఘటన ఇది. అప్పట్లోనే క్రమశిక్షణ లేని పిల్లలు శపించబడి శిక్షింపబడ్డారు. 2000 సం॥ల క్రితమే అపొస్తలుడైన పౌలు ఎఫెసీయులకు పత్రిక వ్రాస్తూ **'దినములు చెడ్డవి'** అని చెప్పాడు. *"దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలె కాక, జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి" (ఎఫెసీ. 5:15).* 2000 సం॥ల క్రితం చెడ్డవైన దినములు ఇప్పుడున్న ఈ టెక్నాలజీ యుగంలో ఇంకెంత చెడ్డగా ఉంటాయో ఆలోచించండి. అయినా కూడా తల్లి దండ్రులకు చీమ కుట్టినట్లుగా కూడా ఉండటం లేదు. ఇలాంటి భయంకరమైన చెడ్డ దినములలో ఉంటున్నా కూడా బిడ్డల ఆధ్యాత్మిక జీవితంపట్ల ఏ మాత్రం శ్రద్ధ తీసుకోకపోగా, మూడు సం॥ల పిల్లలకు సైతం సెల్‌ఫోన్ అలవాటు చేస్తున్నారు. 'బాలుడు నడువవలసిన త్రోవను' వారికి ఈ విధంగా నేర్పిస్తే, వారు పెద్దవారైనప్పటికీ దానినుండి తొలగిపోరు. వారికి మనం మంచి నేర్పిస్తే, పెద్దయ్యాక మంచిగానే జీవిస్తారు. చెడు నేర్పిస్తే పెద్దయ్యాక చెడులోనే జీవిస్తారు. గతంలో చెడు అనేది ఇంటి బయటనే ఉండేది. అందుకే 'బిడ్డలను బయటకు పంపిస్తే చెడిపోతారు' అనేవారు. మరి ఇప్పుడు చెడు అనేది టి.వి., సెల్‌ఫోన్ రూపంలో ఇంట్లోకే ప్రవేశించింది. బిడ్డలు వాటికి అలవాటు పడకుండా చేయడం ఒకరకంగా అసాధ్యమనే చెప్పాలి. తల్లిదండ్రులే టి.వి., సెల్‌ఫోన్‌కి బానిసలైనప్పుడు, వారి బిడ్డలను వాటికి దూరంగా ఉంచడమనేది జరగని పని. దేవునియందు భయభక్తులు కలిగియుండి, దేవున్ని ప్రేమించే తల్లిదండ్రులు **'ఎవరైనా'** ఉంటే, వారు కనీస ప్రయత్నం చేస్తారేమో. ఏదిఏమైనా, మీ బిడ్డలను చాలా చిన్నతనం నుండే దేవుని మార్గంలో నడిపించడం వలన, ఈ టెక్నాలజీ దుష్ప్రభావానికి లోనుకాకుండా ఉంటారు. **'ఈ చిన్నవారిలో ఒకరైనను నశించిపోవడం దేవుని చిత్తము కాదు'** (మత్తయి 18:14).

**(సశేషం)**


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

# శరీరాశ

'హన్నాకృప' పాఠకులకు, మన ప్రభువైన యేసుక్రీస్తు నామమున మీకందరికి నా శుభములు.

నేటి ఈ పాప ప్రపంచంలో పాపం కలిసి పోయిన సంఘంలో శరీరాశ విషయంలో అతి ఎక్కువమంది స్త్రీ పురుషులు చిక్కుకున్న పాపం కామము. ఇది శరీరాశల్లో అన్నింటికన్నా దేవునికి అసహ్యకరమైంది. ఈ తరం దృష్టికి రెండు శరీరాలు కలిస్తేనే వ్యభిచారం. కానీ ఆ పరిశుద్ధ దేవుని దృష్టికి ఒక మోహపు చూపు, ఒక చెడు తలంపు, ఒక సరసోక్తి సంబంధమైన మాట ఇవన్నీ పాపమే. మనిషిని వ్యభిచారం లోకి, రోగాలలోకి, వ్యసనాలలోకి నడిపిస్తున్న ఈ కామము శరీరంలోని 'ఆశ' నుండి కలుగుతుంది. ఆశ ఆకర్షణీయంగా ఉన్న అందం నుండి కలుగుతుంది.. అందానికి ఆకర్షణీయత అలంకరణ వలన వస్తుంది. నేడు లోకము, సంఘములోక కామము అనే పాపం ప్రవేశించడానికి ముఖ్యకారణం అలంకరణే. చాలా ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే అనేక పాపాలకి కారణమైన ఈ అలంకరణని సంఘమంతా కలిసి ఈ ఘోరపాపానికి 'పరిశుద్ధత' అనే మేకప్ వేసి అందరు ఆ పాపంలో మునిగివడం. అలంకరణ వలన చాలా చాలా నష్టాలున్నాయి. కానీ ఏవో నష్టాలు కలిగుతున్నందుకు అలంకరణ పాపము అవ్వలేదు. అలంకరణ కాదు మరి ఏదైనా పాపము అవ్వడానికి లాభనష్టాలతో సంబంధం లేదు. ఒకటి, దేవుడు మానెయ్యమని చెప్పాడంటే వెంటనే మానెయ్యాలి. ఇక ప్రశ్నలు లేవు. ఆయనని ప్రశ్నించే హక్కుగాని, అర్హతగానీ ఈ సృష్టిలో ఎవరికీ లేవు "అవును గాని ఓ మనుష్యుడా, దేవునికి ఎదురు చెప్పుటకు నీవెవడవు'. (రోమా 9:20). నన్ను ఒక ప్రశ్న అడుగనివ్వు, నువ్వు అలంకరణ ఎందుకు చేసుకుంటున్నావ్? దేవుని కోసమా? దేవునికి నీ అందంతో పనిలేదు కదా. ఆయన నీ వేషాన్ని పై రూపాన్ని లక్ష్యపెట్టడు. (గలత 2:6) "దేవుడు నరుని వేషము చూడడు. ప్రభువుని సంతోషపర్చడానికి ఈ అలంకరణ అనేది ఏ మాత్రం ఉప యోగపడదు. పైగా వేషధారణ కలిగిన వాళ్ళంటే ఆయనకు ఆసహ్యం కూడా. హృదయాన్ని పరిశోధించే దేవునికి నీ అలంకరణ ఆనందాన్ని ఇవ్వదు. అంటే నువ్వు అలంకరించు కొనేది దేవుని కోసం కాదు. నీ కోసమా? అసలు నువ్వు అంటే ఎవరు? నీ శరీరమా ? నీ ప్రాణమా (హృదయం, మనసు, మనుష్యాత్మ). 'నువ్వు' అనే నీ ప్రాణం (మనుష్యాత్మ) ఈ లోకంలో ఉన్నంతసేపు నీ శరీరాన్ని ధరిస్తుంది. శరీరం నీదే కానీ నువ్వే శరీరం కాదు. నువ్వంటే నీ హృదయమే. నువ్వు అనే నీ హృదయానికి భక్తి అణకువ, సత్క్రియలు, దీనత్వం అలంకరణలవుతాయి గానీ, బంగారం, మేకప్ అలంకరణ అవ్వవు కదా.

"సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారముగల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగా ఉండవలెను. అది దేవుని దృష్టికి మిగుల విలువగలది" (1పేతురు 3:4). ఈ బాహ్య అలంకరణ వల్ల నీకంటూ ఏ చిన్న ప్రయోజనం లేదు. అంటే నువ్వు అలంకరించుకొనేది నీ కోసం కూడా కాదు. పాప మయమైన శరీరాన్ని ఎన్ని రకాలుగా అందంగా ముస్తాబు చేసుకోవాలా అని నీ మనస్సు ఆశపడి శరీరాలంకరణల మీద మనసునుంచితే నీవు శరీరానికి లోబడి పాపం చేసినట్లు కదా. బయటి వారి దగ్గర హెచ్చించుకోవడానికా? పెళ్ళిళ్ళకో పార్టీలకో, బంధువుల దగ్గరకో వెళ్ళేటప్పుడు ఉన్న నగలన్ని దిగేసుకుని వెళ్తావ్. చాలకపోతే ఇరుగు పొరుగు వారివి కూడా తీస్కుంటావు. నీకంటూ అక్కడ విలువివ్వాలని, నువ్వెవరికంటే తక్కువ దానివి కాదని అందరికీ తెలియాలినే కదా ఈ ప్రయత్నాలు. ఎదుటి వారిని ఆకర్షించడానికా? ఎదుటి వారిని మోహపు చూపుతో చూడటమెంత పాపమో, ఎదుటివారు నిన్ను మోహపు చూపుతో చూడాలని కోరుకోవడం కూడా అంతే పాపము . నీకు శరీరాశ లేదనుకోవడం అబద్ధం. ప్రపంచంలో అన్నింటికన్నా, దేవునికన్నా, ప్రాణం కన్నా కూడా నీకు శరీరాన్ని అలంకరించుకోవాలన్న ఆశ ఎక్కువ. ఇది శరీరాను సారమైన మనస్సు. ఇది సత్యం. ఆత్మనుసారమైన మనస్సు దేవుడు మనకందరికి దయచేయునుగాక. ఆమేన్.

**–ఇట్లు డా॥ సుష్మ ప్రశాంత్, నెల్లూరు**

# నా కుటుంబము



**భార్య, భర్త, పిల్లలు కలిసి ఒకే చోట ఉంటే దానిని కుటుంబము అంటారు. పిల్లలు ఉన్నా లేకపోయినా భార్యా భర్తలు కలిసి జీవిస్తున్నా కుటుంబమనే అంటారు. కుటుంబ వ్యవస్థ అనేది దేవుని ప్రణాళికలో భాగమే. కుటుంబ వ్యవస్థలో స్త్రీ ప్రధాన భూమిక పోషిస్తుంది.**

---

దావీదు తన దేవుని విషయమైన ఆసక్తి నేను దేవదారు మ్రానులతో కట్టబడిన నగరులో ఉన్నాను. యెహోవా నిబంధన మందసము తెరల చాటున ఉన్నది. కనుక ఆలయం కట్టాలనే అభిలాష నాతాను ప్రవక్తకు చెప్పాడు. అయితే దేవుడైన యెహోవా దావీదుతో మందిరము కట్టించకపోయినా దేవాలయం కట్టిన దీవెన “నిన్ను స్థాపించుటకై నేను కొట్టివేసిన సౌలునకు నా కృప దూరమై నట్లు నీ కుమారునికి నా కృప దూరము చేయను. నీ మట్టుకు నీ సంతానమును నీ రాజ్యమును నిత్యము స్థిరమగును. నీ సింహాసనము నిత్యము స్థిరపరచబడును” అన్నాడు.

కాబట్టి దేవుడు మనకు అనుగ్రహించిన మన కుటుంబం, మన కుటుంబమే కాక మన కుటుంబంలో నుండి వచ్చే అనేక తరములలోని కుటుంబాలు దీవించబడుటకు మన కుటుంబమే కారణము కాగలదు.

నేడు మన పట్టణాలలో అద్భుతముగా హెచ్చింబడిన వ్యక్తులుగాని వారి సంతానంగాని వారికి పూర్వం నివశించిన వారి వలన దీవెన పొందియున్నారు. ఈ లోకంలో మన కుటుంబం హెచ్చించబడాలంటే మంచి చదువులు చదవాలి. ఆ చదువులు చదివించటానికి కావలసిన ఆర్థికస్థితి కొరకు ఎన్నో అడ్డదారులు తొక్కి, చివరికి శాపమే సంపాదిస్తున్నారు. ఉన్నత చదువులు చదివించాలని ముక్కు పచ్చలారని చిన్న వయస్సులోనే వారిని కుటుంబమునకు దూరపరచి ప్రతి మానవునికి దేవుడు అనుగ్రహించిన తల్లిదండ్రుల, అన్న దమ్ముల, అక్కచెల్లెండ్ర ప్రేమ మాధుర్యాన్ని పారద్రోలు తున్నాము.

ఈ జీవితం చిన్నది! నీడవంటిది! అని అందరూ ఒప్పుకుంటారు. కాని ప్రక్కవాని కుటుంబం కంటే మన కుటుంబం గొప్పగా ఉండాలని కాని, గొప్ప వాళ్ళ జాబితా లోకి మన కుటుంబం చేర్చబడాలని ఎంతో దుఃఖ పూరిత మైన కుటుంబాన్ని మనం గడుపుతూ ఉన్నాము.

వేలాది, లక్షలాది కుటుంబాల కంటే మన కుటుంబమును దేవుడు ఆర్థికంగా హెచ్చించినప్పటికీ అందుకు దేవునికి కృతజ్ఞత చెల్లించక వందలలో పదుల్లో మనకంటే హెచ్చింప బడిన కుటుంబాలను చూసి మనకు దేవుడిచ్చిన నెమ్మదిని సమాధానాన్ని పోగొట్టుకుంటాము.

“ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి అప్పుడవన్నియు మీకనుగ్రహించబడును”.


భూమి ఫలవృక్షములను మొలిపింపగా అది మంచిదని దేవుడు చూచెను. వెలుగును చీకటిని వేరుపరచుటకు ఆకాశవిశాలమందు జ్యోతులను ఉంచెను. అది మంచిదని దేవుడు చూచెను. దేవుడు తాను చేసినది యావత్తును చూచినప్పుడు అది చాలా మంచిదిగ నుండెను.

దేవుడు సమస్తమును మంచిదిగా చేశాడు. ఆయన ముగింపులో చేసినది హవ్వను. సృష్టి కార్యము పూర్తయింది అనుకున్న తర్వాత ఆదాము సంతోషంగా కనిపించలేదు. అతనికి సంతోషం కలిగించటానికి తాను సృజించిన ప్రాణు లన్నిటిని ఆదాము దగ్గరకు తీసుకొని వచ్చాడు. ఇంకా ఏదో వెలితి కనబడుతుంది. అందువలన ఆదాములో నుండి హవ్వను తయారుచేసి మానవ కుటుంబాన్ని తయారు చేసినప్పుడు ఆయన సంతృప్తి చెందాడు.

దేవుడు చేసిన కుటుంబంలోని వారు పండు తినక ముందు ఎన్నివేల కోట్లమంది మరణము నెరుగని మానవులు ఈ భూమి మీద ఎంతమంది ఉన్నారో మనకు తెలియదు గాని, జీవముగల ప్రతివానికి తల్లి అయిన ‘నారి’ హవ్వగా మారింది. ఆమె వలననే పాపము ఈ లోకములోనికి వచ్చింది. కుటుంబం విచ్ఛిన్నమయింది. కయీను తన ఇల్లు వదలి దేశ దిమ్మరి అయినాడు. **(సశేషం)**

## ఈ నెల ప్రశ్న - సెప్టెంబర్-2025

**అహరోను ఎక్కడ చనిపోయి పాతిపెట్టబడెను?** (ద్వితీయోపదేశకాండము)




మీ జవాబు (రెఫరెన్సుతో సహా) ఈ నెల 15వ తేదీలోపు 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా మాత్రమే పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో **'లక్కిడిప్'** ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ.250/–లు విలువ చేసే **'అపొస్తలుడు'** అనే పుస్తకం బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం కేవలం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు (చందాదారుల పట్టికలో పేరు ఉన్నవారు) ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 15వ తేది లోపు చందా చెల్లించేవారు కూడా పాల్గొనవచ్చును. ఈ క్రింది బాక్సులో జవాబు, మీ పేరు, బుక్ సీరియల్ నంబరు వేసి ఫోటో తీసి వాట్సాప్ ద్వారా పంపించాలి. పేరు, సీరియల్ నంబరు లేకపోతే వారి పేరు లక్కిడిప్‌లో చేర్చబడదు.

జవాబు.......................................................

పేరు.........................................................

గ్రామము...............బుక్ సీరియల్ నంబరు..........

**ఆగష్టు–2025 ప్రశ్న జవాబు :**
**లేవి (సంఖ్యాకాండము 26:59)**

**జవాబులు పంపినవారు :**

1. జి. ఏంజల్ పౌలాస్–ఒంగోలు, 2. జి. శిరోమణి–వేల్పూరు, 3. వై. సంధ్యారాణి –ఒంగోలు, 4. కె. అశోక్‌కుమార్–ఒంగోలు 3. టి. క్రిస్టియానమ్మ–నందికొట్కూరు,

## చందాదారుల వివరములు

| | | |
|---|---|---|
| కర్మేల్ హెల్త్‌కేర్, పులివెందుల | (08-07-25) | 5000 |
| డా॥ బి. ప్రజ్వలిత్ రూబేన్, హన్మకొండ | (12-10-24) | 5000 |
| రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి | (15-01-24) | 5000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (21-06-24) | 5000 |
| మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా | (29-11-22) | 5000 |
| బి. ప్రభువరకుమార్, రామన్నపేట | (24-06-25) | 3000 |
| కె. రజిని, నరసరావుపేట | (15-06-25) | 3000 |
| డా॥ క్రిస్టియన్ సిరప్ప, అనంతపూర్ | (06-07-24) | 3000 |
| యు. అనిత, సిరివెళ్ళ | (06-12-24) | 3000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (22-08-25) | 2000 |
| పి. జయదేవి, గుంటూరు | (03-07-25) | 2000 |
| వై. సంధ్యారాణి, ఒంగోలు | (04-01-25) | 2000 |
| పి.వి.కెరోలిన్, గుంటూరు | (11-12-24) | 2000 |
| డా॥ సిహెచ్‌కె. సుష్మప్రశాంత్, నెల్లూరు | (22-01-24) | 1500 |
| కొడవటికంటి అశోక్‌కుమార్, ఒంగోలు | (09-08-25) | 1000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (27-03-25) | 1000 |
| జి. కమలాకర్, ఒంగోలు | (03-03-25) | 1000 |
| శ్రీమతి రూతు హోసన్న, కావలి | (09-11-24) | 1000 |
| జి.మాణిక్యమ్మ అనంతపురం | (25-03-24) | 1000 |
| ఆర్. జయమ్మలాబాను, గుంతకల్లు | (16-07-25) | 500 |
| జి. జార్జిథామస్, దుగ్గిరాల | (12-03-25) | 500 |
| కె. ప్రకాశరావు, నరసరావుపేట | (14-01-25) | 500 |
| బి. నెహెమ్యా, చిన్నగంజాం | (25-12-24) | 500 |
| బి. జయరావు, బుచ్చిరెడ్డిపాలెం | (06-11-24) | 500 |
| డి. నాగేశ్వరరావు, సంతరావూరు | (10-11-24) | 500 |
| కె. కమల్, మంచిర్యాల, తెలంగాణ | (14-10-24) | 500 |
| యం. విల్సన్, నెల్లూరు | (14-09-24) | 500 |
| కె. ఆదిలక్ష్మి, డిస్ట్రిక్ట్ లైబ్రరి, ఒంగోలు | (24-09-24) | 500 |
| కె. ఐజక్‌సుకుమార్, ఒంగోలు | (14-08-24) | 500 |
| బి. సరోజిని, గుంతకల్లు | (06-05-25) | 400 |
| పి. స్వప్న, పాల్వంచ | (09-08-25) | 350 |
| మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ | (06-08-25) | 350 |
| జి. భగవాన్‌దాస్, ఒంగోలు | (02-08-25) | 350 |
| జి. రవి, వేల్పూరు | (12-07-25) | 350 |
| స్వయంప్రభ, చిలకలూరిపేట | (14-06-25) | 350 |
| యస్. రాజశేఖర్, కర్నూలు | (04-06-25) | 350 |
| జి. దేవదాసు, నంద్యాల | (05-04-25) | 350 |
| జి. కళావతి జాకబ్, ఒంగోలు | (03-04-25) | 350 |
| ఆర్.ఆర్.కె.పీటర్–విశాఖపట్నం | (23-03-25) | 350 |
| పి. జాన్‌బాబు–గోపాలపురం | (21-03-25) | 350 |
| ఎ. ప్రభుచరణ్–జగిత్యాల | (19-03-25) | 350 |
| పి. నీలిమారాజారత్నం, ఉయ్యూరు | (14-03-25) | 350 |
| యస్. గోపి, పార్వతిపురం | (17-12-24) | 350 |
| బి. రవికుమార్, హైదరాబాద్ | (20-11-24) | 350 |
| వి. రత్నమ్మ, హైదరాబాద్ | (17-10-24) | 350 |
| జి. క్యాథరిన్, ఒంగోలు | (08-10-24) | 350 |
| వై. జోసఫ్, భీమవరం | (04-10-24) | 350 |
| కె. రాబర్ట్ ప్రభాకర్, ఉదయగిరి | (03-10-24) | 350 |
| సిహెచ్. శైలజ, విజయవాడ | (04-04-25) | 200 |

**చిన్నపిల్లల పేజి**

# ప్రార్థన

దేవుని ఎరిగిన మేరీ డేవిడ్‌లకు జెస్సికా, జాషువా అని ఇద్దరు పిల్లలు. మేరీ, జాషువాలు మంచి విశ్వాసులు. కష్టపడి పనిచేసి కుటుంబాన్ని పోషిస్తుండగా, మేరీ పిల్లలను దేవుని క్రమంలో నడుపటకు తన శాయశక్తులా ప్రయత్నించేది.

జాషువా చిన్నవాడు, కాస్త అల్లరి ఎక్కువ. కానీ జెస్సికా, వాళ్ళ అమ్మ చెప్పిన ప్రకారం నడచుకునేది. చాలా మంచి అమ్మాయి. ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా సండే స్కూల్‌కి వెళ్ళేది సండేస్కూల్‌లో నేర్చుకున్న విషయాలను పాటించేది. ఆ క్రమంలోనే ప్రార్థన చేయడం జెస్సికా దినచర్యలో భాగమైంది. ప్రతిరోజు నిద్రలేవగానే దేవునికి కృతజ్ఞతలు చెప్పి తన దినమును ప్రారంభించేది. ఆ రోజు తను చేయబోవు పనులన్నిటిలో దేవుని సహాయం కోరేది. అలాగే పడుకునే ముందు దేవునికి ప్రార్థించి ఆ దినాన దేవుని సహాయానికి కృతజ్ఞతలు తెల్పి పడుకునేది ఇలా జెస్సికా ప్రతిదినమూ ప్రార్థించేది. ఒక్క దినము కూడా ప్రార్థనను వాయిదా వేయడం కాని, ప్రార్థన చేయకపోవటం కాని చేసేది కాదు.

ఒకరోజు స్కూల్ నుండి ఇంటికి వచ్చేసరికి ఒక పెద్దాయన జెస్సికాను చూచి చిరునవ్వు నవ్వాడు. జెస్సికా, ఎవరా? అని తల్లిని అడగగా తమకు దూరపు బంధువు అని, జెస్సికాకు తాతయ్య అవుతారని చెప్పింది. జెస్సికా తమ ఇంటికి వచ్చిన తాతయ్యతో రోజు కొంత సమయం గడిపేది తాతయ్య చెప్పే బైబిల్ కథలంటే జెస్సికాకీ ఎంతో ఇష్టం. జెస్సికా క్రమశిక్షణ క్రమం తప్పకుండా ప్రార్థించే గుణం తాతయ్యకు నచ్చింది.

అంతా సవ్యంగా జరుగుతున్న సమయంలో తాతయ్య తిరిగి ప్రయాణించవలసిన సమయం వచ్చింది. తాతయ్య వెళ్తూ వెళ్తూ జెస్సికాకు ఒక వెండి నాణెం బహుమానంగా ఇచ్చి వెళ్ళాడు. జెస్సికా ఆనందానికి హద్దులు లేవు. ఆ వెండి నాణెంను చూసుకుంటూ ఆ డబ్బుతో ఏమేమి కొనాలి? అని రోజంతా ఆలోచిస్తూ ఆ నాణెంను చూసుకుంటూ మురిసిపోయింది.

ఒకరోజంతా ఆలోచించిన తరువాత ఒక బార్బి బొమ్మ కొనాలని నిశ్చయించుకుని వెండి నాణెంను తీయబోయింది. వెండి నాణెం లేదు. అంతే జెస్సికాకు ఏడుపు ముంచు కొచ్చింది. వెండి నాణెం దొరకాలని ప్రార్థించింది. తను ఎక్కడేక్కడికి వెళ్ళిందో అక్కడంతా వెదికింది. వెండి నాణెం కనబడలేదు. సాయంత్రమైంది వెండి నాణెం కనబడలేదు. రాత్రి భోజనం కూడా అయిపోయింది. వెండి నాణెం మాత్రం కనబలేదు. జెస్సికా మనసంతా బాధగా ఉంది, ఖచ్చితంగా తనను ఏడిపించుటకు జాషువా వెండి నాణెంను తీసి ఉండవచ్చు అనుకుంది. తన వెండి నాణెం దొరకనందుకు దేవునిపై కోపం వచ్చింది. ఏడుస్తూ పడుకుంది. తన మనసంతా బాధగా ఉండటంతో జెస్సికా ప్రార్థించాలి అనుకోలేదు. కానీ ఎలాంటి సమయాల్లో అయిన ప్రార్థనను వాయిదా వేయకూడదు అని తన మనస్సులో అనిపిస్తూనే ఉండడంతో, జెస్సికా ప్రార్థనకు మోకరించింది. మోకాలికి ఏదో గుచ్చుకుంది. ఏంటా అని చూస్తే, వెండి నాణెం. జెస్సికా ఆనందానికి హద్దులు లేవు. దేవునికి థ్యాంక్స్ చెప్పి హాయిగా పడుకుంది.

అన్ని సమస్యలకు జవాబు ప్రార్థనే. ప్రార్థించడం ద్వారా దేవునితో సంబంధం కలిగి ఉంటాము. దేవునితో సంబంధము మనలను మంచివైపుకు, నిజమైన మేలువైపుగా నడిపిస్తుంది.

***కంఠత చేయవలసిన వాక్యము: యెడతెగక ప్రార్థన చేయుడి. ప్రతి విషయమునందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఈలాగు చేయుట యేసుక్రీస్తునందు మీ విషయంలో దేవుని చిత్తము. 1థెస్సలో. 5:17,18***

**(12వ పేజీ తరువాయి)**

పండుకొని ఉంటే ఉరుములు, మెరుపులతో ప్రభువు ప్రత్యక్షమై ప్రార్ధన చెయ్యి దెయ్యాలు పోతాయి అనే స్వరం విన్నాను. ఒకరోజు శ్యామలమ్మకి అమ్మేసిన ఇంట్లో నిద్రపోతుంటే గొప్ప వెలుతురుతో ప్రభువు దర్శనం చూశాను. ఇప్పుడు వేటకు వెళ్ళటం మానివేశాను. నా కుటుంబములో నా భార్య, కొడుకు రక్షింపబడకముందు నా మీద తిరుగుబాటు చేసేవారు. ఇప్పుడైతే రక్షణ పొంది నాతో సహకరిస్తున్నారు. కొడుకు కొత్తపట్నంలోనే పదవ తరగతి చదివి, ఒంగోలులో ఇంటర్ చదివాడు. రాజమండ్రిలోని అంబాజీపేటలో వజ్రకుమార్ అనే పాస్టరు మా అబ్బాయిని కర్ణాటకలో బైబిల్ ట్రైనింగ్‌కి పంపించాడు. మా పల్లెపాలెంలో కూడా అనేకమంది ప్రభువు బిడ్డల్ని పిలిపించి, పదిమందికి బైబిల్ ట్రైనింగ్ ఇచ్చాను. నా పనులన్నిటిలో సిలివెల్ల శ్యామలమ్మగారు ఎంతో సహకరిస్తుంటారు, సలహాలిస్తుంటారు.

దేవుని కృపవలన, ఇక్కడి కొంతమంది విశ్వాసులతో కలసి నా సేవా పరిచర్యను కొనసాగిస్తున్నాను. నా సేవా పరిచర్య కొరకు, సంఘ అభివృద్ధికొరకు, నా వ్యక్తిగత విశ్వాస ఎదుగుదల కొరకు ప్రార్థించండి.



**సండేస్కూల్/V.B.S. బుక్స్ మరియు గేమ్స్ కొరకు**

**ఫోన్: 9440217726**


## గమనిక

క్రైస్తవ కథలు, సాక్ష్యాలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. క్రైస్తవ కథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.

## బైబిల్ పద వినోదము-8 జవాబులు



**జవాబులు పంపినవారు :**

1. జి. ఏంజల్ పౌలాస్- ఒంగోలు, 2. కె. లలితాభాగ్యం-కనిగిరి, 3. కె. విజయబాబు-కరెవరం, 4. బి. నెహెమ్యా-చిన్నగంజాం, 5. యం. స్వయంప్రభ-చిలకలూరిపేట, 6. బి. ప్రేమలత-నెల్లూరు, 7. టి. క్రిస్టియానమ్మ-నందికొట్కూరు, 8. జి. శిరోమణి-వేల్పూరు, 9. జె. రాజకుమారి-గుంటూరు, 10. వై. సంధ్యారాణి -ఒంగోలు, 11. పి. ప్రభుకుమార్-ఒంగోలు, 12. కె. అశోక్‌కుమార్-ఒంగోలు, 13. కె. మేరిపవిత్ర-మంచిర్యాల, 14. ఎ. బలరామ్-ఒంగోలు, 15. పి. విజయకుమారి-ఒంగోలు.


## కొడవటికంటి రచనలు

**అపొస్తలుడు -** **రూ. 250/-**
(అపొస్తలుడైన పౌలు కథ - నవల)

**జప్నత్పనేహు -** **రూ. 250/-**
(యోసేపు కథ - నవల)

**నా చిత్తానుసారుడు** **రూ. 250/-**
(దావీదు కథ - నవల)

**మిక్కిలి సాత్వికుడు** **రూ. 150/-**
(మోషే కథ - నవల)

**గోత్రకర్త** (యాకోబు కథ-నవల) **రూ. 250/-**

# బైబిల్ పద వినోదం - 09

## యోసేపు

ఈ క్రింది పదాలను ప్రక్కనున్న అక్షరాలలో వెదకండి. పదాలు అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఉండవచ్చు, కానీ పదాలు ఒకదాని మీదగా ఇంకొకటి గుర్తించకూడదు. గుర్తించిన క్రింది పదమును (✓) టిక్ పెట్టండి

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| అ | గుం | పూ | అ | స | తే | అ | పో | క | చి | దో | ల | ము | కె | షె |
| సూ | ట | ర్వి | అ | మ్మ | వ | నె | తీ | క | ల | తా | స | వ | అ | మ |
| య | ల | కు | చె | తి | వ | ర | ఫ | ల | న | ను | స | మృ | ద్ధి | స్త |
| ఒ | అ | లు | ర | గో | షె | ను | రు | ఎ | గ | తా | ళి | అ | రూ | కి |
| ప | న | లు | సా | అ | సా | ధ్య | ము | జీ | దై | వ | భా | క్షీ | క | అ |
| గో | నె | లు | ల | న | ద | ర్యా | మ | అ | వ | అ | వ | ణ | లు | గం |
| కా | యి | లా | అ | యా | జ | కు | లు | త | న | ము | ము | త | ప | వౌ |
| ర్య | చ | రి | ప | అ | పిం | డి | వం | ట | లు | అ | పో | తీ | ఫె | ర |
| మై | న | ఆ | సె | న | తు | అ | త్మ | మి | ద్యా | నీ | యు | లు | పే | లు |
| అ | ము | వే | బై | హే | అ | గ | బ | జ | డి | సి | ము | న | కు | శ |
| దు | న | గు | ము | య | బో | ర్భ | ల | వి | నా | యిం | చు | ట | అ | లు |
| లా | ది | ల | క్ష | ము | ళ | వా | హీ | ము | బ | వ | ర్త | కు | లు | ము |
| గి | న్మ | వా | మ | అ | ము | స | న | ర | త్తె | లు | క | రు | వు | త్ర |
| అ | జ | రు | స | లై | అ | ము | ము | పా | ము | క్షు | బ | ప | అ | క్ష |
| గు | గ్గి | ల | ము | అ | కో | ప | ము | వ్యా | అ | ప | ఖై | దీ | లు | న |

పేరు...................................గ్రామము...................................

అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు.......................................

**'బైబిలు పద వినోదము-09'** పూర్తి చేసిన తర్వాత పేరు, ఊరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు వ్రాసి ఈ పేజీని ఫోటో తీసి 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా పంపగలరు లేదా ఈ పేజీని జెరాక్స్ తీసి **15వ తేదీలోగా** మా అడ్రసుకు పంపగలరు. సీరియల్ నంబరు వేయకపోతే వారి పేరు ప్రచురింపబడదు.

| | | | | |
|---|---|---|---|---|
| అసూయ | సమ్మతి | పిండివంటలు | రూకలు | పోతీఫెర |
| పనలు | మిద్యానీయులు | గంప | హేయము | పరిచర్య |
| నక్షత్రములు | వర్తకులు | పక్షులు | శకునము | క్షీణత |
| షెకెము | పోతీఫరు | జన్మదినము | గోషెను | పూర్వికులు |
| దోతాను | ఎగతాళి | ఆసెనతు | బత్తెము | ఖైదీలు |
| గుంట | చెరసాల | సమృద్ధి | యాజకులు | కోపము |
| గుగ్గిలము | కల | బలహీనము | కాయిలా | అసాధ్యము |
| మస్తకి | భావము | జీవము | గర్భవాసము | వ్యాపారము |
| బోళము | కరువు | వేగులవారు | వినాయించుట | గోనెలు |
| గిలాదు | మర్యాద | తేనె | సమక్షము | జడిసి |